# 8 నర(క)లోకం

శౌనకాది మునులకు 'జాగరూకులురై వినుం' డని సూతుం

డవ్వలి కథావృత్తాంతం బిట్లని చెప్పం దొడంగె.

*  *  *

త్రిలోక సంచారియైన నారద మహర్షులవారు ఒకనాడు భూలోక సంచారం యావత్తూ ముగించుకొని, మరీ ఎండగా ఉండటం మూలాన, ఒక అరణ్యంలోని వటవృక్షం క్రింద కూర్చుని సేదతీర్చుకొంటున్నారు.

ఈ విషయం వేగులద్వారా తెలుసుకొన్న ఆ అరణ్యాధిపతి, సింహరాజు, తగుకాన్కలతో నారదులవారి సన్నిధికొచ్చి కాన్కలు సమర్పించి, తన భక్తి ప్రపత్తులను తెలియ చేసుకొన్నాడు. నిజానికి ఈ కాన్కలతో నారదుడు ఎంతో సంతోషించ వలసి ఉంది. ఎందుకంటే, మరే అరణ్యరాజ్యంలోనూ ఉండని, ఉండటానికి వీలు లేని, చిత్రవిచిత్ర వస్తు సముదాయాన్ని సింహరాజు కానుక లిచ్చారు. మరొకరైతే, ఈ పాటికి హర్షపులకిత గాత్రులై, అమందానంద కందళిత హృదయారవిందులై, సింహరాజు కోరిన వరా లిచ్చి ఉందురు. అసలా అభిప్రాయంతోనే సింహరాజు, అలాంటి అపురూప

వస్తువులను నారదునికి సమర్పించాడు. అయితే సింహరాజు అభిప్రాయం తలక్రిందు లయింది. నారదుడు హర్ష ప్రకటన చేయలేదు సరిగదా, నిట్టూర్చి, మరింత విచారాక్రాంతుడై నాడు.

లోపమేమయినా జరిగిందేమోనని సింహరాజు హడలి పోయినాడు.

'స్వామీ! నాకు తెలిసినంత మేరకు, నేనేమీ అపచారం చేయలేదు. దురదృష్టవశాత్తు అలాంటిది సంభవిస్తే, అది బుద్ధి పూర్వకంగా చేసి ఉండలేదని నా మనవి. ఒకవేళ నాకు తెలియకుండా, తమపట్ల ఏదైనా అపరాధం జరిగిందేమో, ఈ దాసునకు తెలియపరచండి. కృతజ్ఞతా పూర్వకంగా స్వీకరి స్తాడు' అన్నాడు సింహరాజు.

నారదుడు కొన్ని క్షణాలు నిశితంగా సింహరాజు ముఖంలోకి చూశాడు. ఆ చూపుల ధాటికి తట్టుకోలేక సింహ రాజు తల దించేసుకొన్నాడు. నారదుడు జాగ్రత్తగా మహ తిని ప్రక్కన బెట్టి, దీర్ఘంగా నిశ్వసించి, చిన్న ధ్వని చేశాడు. సింహరాజు ఆ ధ్వని విని గడగడ లాడిపోయాడు.

నారదుని ముఖం క్షణకాలం హసించింది.

సింహరాజులో ఆశ పొటమరించింది.

నారదుడు దగ్గి గొంతు సరిచేసుకొని—

'సింహరాజా! నీ ఆతిథ్యం నాకెంతో తృప్తి నిచ్చింది. నీ కానుకలు నాకు అమితానందాన్ని చేకూర్చాయి; నిజమే,

అయినా నేను ఆనందించలేక పోతున్నాను. నాకు తెలుసు 'ఎందుకా ?' అని నువ్వాలోచిస్తున్నావు కదూ ? ఎందు కా లోచిస్తున్నానో చెప్పాలనే ఉంది. కానీ నీ క్షేమం కాంక్షించిన వాడను గనుక చెప్పలేక పోతున్నాను' అన్నాడు.

సింహరాజు వినయం ఉట్టిపడేలా అన్నాడు: 'స్వామీ ! మీ మాటలు నాకు చిత్రంగా ఉన్నాయి. ఇది నా దురదృష్ట మనుకొంటాను. కాకపోతే, మీరు శ్రేయోభిలాషులయి ఉండి గూడా, నా అనుమానాన్ని రహితం చెయ్యక పోవడాన్ని మరొకలాగ సమర్థించుకోలేను. ఆప్తులపట్ల అరవిడిచి మాట్లాడ టం సత్పురుషుల లక్షణమని విజ్ఞులంటారు. తమ విచారకార ణాన్ని తెలియజేసి, నన్ను కరుణించండి'.

'నాయనా ! నీ వినయం నన్ను బలహీనుణ్ణి చేసివేస్తు న్నది.' అన్నాడు నారదుడు. 'సత్యాన్ని భరించటం కష్టమని నీకు తెలుసు. పెద్దలుకూడా ప్రియమైన సత్యాన్నే చెప్ప మన్నారు. అయినా నీపట్ల నాకున్న అభిమానంతో నీకు నిజం చెబుతున్నాను.'

'ఇందువల్ల నీమనస్సు బాధపడుతుందని నాకు తెలుసు. చెప్పనందువల్ల నువ్వు మరింత బాధపడతావు. ఈ రెండింటి లాభనష్టాలను బేరీజువేసిచూస్తే, చెప్పటమే ఉత్తమమని, నా అంతరాత్మ ఘోషిస్తున్నది. అందుకే చెబుతున్నాను.'

అని నారదుడు ఒక్క నిమిషం ఆగాడు. సింహరాజు, అతని పరివారము, ఆశ్చర్యంతో, నోళ్ళు తెరుచుకొని నార

దునివైపు చూశారు.

'సింహరాజా !' అన్నాడు నారదుడు. 'నీ ఆధిక్యతను చాటుకొందుకు నువ్వు మాకు అపూర్వ కానుక లర్పించావు. అందువల్ల నేను సంతోషించాలని నీ అభిప్రాయం. ఒకప్పుడైతే అలాగే సంతోషించి వుందును; అలాగని ఇప్పుడు సంతోషించలేదని నువ్వనుకో నవసరం లేదు. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, నేనిప్పుడే భూలోకం యావత్తు సంచరించి వస్తున్నాను. అనేకమయిన కారణాలవల్ల నే నీమధ్య భూలోకం రావడం లేదు. నా తుదిరాకకు ఇప్పటికీ మధ్య భూలోకం అమితంగా మారిపోయింది. ఎంతగా మారిపోయిందంటే ఇది భూలోకమేనని నేనే నమ్మలేక పోయాను. భూలోకానికని బయలుదేరి, పొరపాటున మరో లోకం వచ్చి ఉంటానన్న సందేహం కొన్ని గంటలు నన్ను వేధించింది. అపూర్వము అనూహ్యము అయిన విధంగా మానవుడు మారిపోయాడు. ఒకప్పుడు ప్రకృతికి బానిసగా ఉండి, ప్రతి క్షణమూ, కైమోడ్పు లర్పించే మానవుడు, ఈనాడు ప్రకృతినే బానిసగా చేసుకొన్నాడు. నిజం ! నన్ను నేనే నమ్మలేక పోయాను...'

'నిజమా స్వామీ ?' అన్నాడు సింహరాజు.

'నన్నే విశ్వసించవా ?' అన్నాడు నారదుడు. 'తనివి తీరా భూమినంతా చుట్టి వచ్చాను. ఎన్నో చిత్ర విచిత్రాలు చూశాను. అవన్నీ వర్ణించటం నావల్లకాదు. ఆ మనుష్యుల్ని వదిలి రాబుద్ధి పుట్టలేదు. వాళ్ళమధ్యనే స్థిరనివాసం ఏర్పరచు

కొందామనుకొన్నాను. కానీ—' అని ఆగాడు నారదుడు.

సింహరాజు జూలు విదిలించుకొన్నాడు.

'అలా ఉన్నందువల్ల మరికొన్ని చిక్కు లున్నాయి. మానవుడు సాధించిన యీ అపూర్వ విజయం గురించి, ఇతర లోకాలకు ఏపాటి తెలుసునో నాకు తెలీదు. ఎందుకంటే కొన్ని శతాబ్దాలనుండీ, ఇతర లోక వాసులు భూలోకాన్ని గురించి ఏమీ పట్టించుకోవడం లేదు. అయినప్పుడు - నేనిక్కడే ఉండడంవల్ల, ఈ విజయవార్త ఇతరులకు తెలిసే దోవ లేదే! నేను గనుక ఉండలేక ఇలా వచ్చాను గానీ, మరొకరికి ఇలా రావలసిన అవసరం లేదే! దీన్ని నలుగురి చెవినీ వెయ్యాలంటే, నేను భూలోకాన్ని అంటిపెట్టుకొని లాభం లేదు. స్వసుఖాన్ని గూడా విడిచిపెట్టి పదిమందికి ఇది తెలియజెయ్యాలి. ఆ అభిప్రాయంతోనే బయలు దేరాను. అలసిపోయి, దోవలో నువ్వున్నావుగదా అని యిలా వచ్చాను ... ఇప్పటికీ అసలు విషయం చెప్పనే లేదు - అటువంటి మహత్తర విజయాలను చూచిన కళ్ళతో, నీకానుకలను చూసేసరికి నాకు సంతోషం కలగలేదు.' అన్నాడు నారదుడు.

'స్వామీ' సింహరాజు గుండె దిటవు తెచ్చుకొని అన్నాడు. 'నా రాజ్యంలో ఇంతకన్న విలువైన వస్తువులు లేవు. ఉన్న వాటిలోకల్లా, ఉత్తమ తరగతికి చెందినవే తమకిచ్చాను.'

నారదుడు ఫక్కున నవ్వాడు.

'పిచ్చివాడా! నేను నీవ్యక్తిత్వాన్ని అనుమానించడం లేదు. అనుమానిస్తున్నానని నువ్వు అనుకోకు. కాని నావి రాజును చూసిన కళ్ళు. అవి మామూలు స్థితికి రావటానికి మరికొంత కాలం పట్టవచ్చు. చిత్రమేమిటంటే, ఈలోగా మానవుడు మరి కొన్ని గజాలు ముందు కెడతాడు. తిరిగి అప్పుడుగూడా నేను ఈస్థితికే రావలసి వుంటుంది. ఇంతటితో మానవుడు ఆగిపోతాడని ఖచ్చితంగా చెప్పేందుకు, నాకు సాహసం చాలదు. సరే... నేను వెడుతున్నాను' అని లేవబోయినాడు నారదుడు.

'మీ మాటలు నమ్మ శక్యం కాకుండా ఉన్నాయి!' అన్నాడు సింహరాజు. 'అలాగని మీకు అసత్యదోష మంగగట్టే సాహసం నాకులేదు. అలాంటి నీ చుణ్ణి క్షాదని మనవి...'

మధ్యలోనే నారదు డందుకొన్నాడు.

'అమాయికుడా! నిన్నుచూస్తే నాకు జాలి కలుగుతోంది. నన్ను నేనే నమ్మలేదని చెబుతున్నప్పుడు, నామాటల్లో నీకు నమ్మకం ఎలా ఉంటుం దనుకొంటా ననుకొన్నావ్? ఒక్కమాట చెబుతాను విను. చచ్చేలోపుగా, ఒకసారి మానవలోకాన్ని చూడడం కన్నా, జన్మలో సాధించవలసింది లేదు.'

'నాకు లేనిపోని ఆశను కలిగించారు' అన్నాడు సింహరాజు వినయంగా, 'మీరింతగా చెబుతున్నప్పుడు నమ్మకపోవ

టం నా మూర్ఖత్వానికి చిహ్నం. అయినా నాకో దురభ్యాస మున్నది. ఏ విషయమైనా రుజువులేనిదే నేను విశ్వసించను. క్షమించండి. ఈ దురలవాటు మానుకోవాలని, నేను శతధా ప్రయత్నించిగూడా విఫలుణ్నయినాను. ఇంత వయస్సు వచ్చి, ఇక మారుతా ననుకోవడం ఆత్మవంచన అవుతుంది...'

'నీ అభిప్రాయం నాకర్థమైంది' అన్నాడు నారదుడు నవ్వి.

'త్రికాలవేదులు, తమకు తెలియని దేమున్నది స్వామీ!' అన్నాడు సింహరాజు.

'ఆహా! నువ్వొక్కసారి మానవ లోకాన్ని చూడటం చాలా అవసరం. అందువల్ల నువ్వెంతో బాగుపడతావు. నీ జీవితం వైపుకు కొత్త కిటికీలు తెరుచుకొంటాయి. నీ ఆధిపత్యం తాలూకు అహంకారం తగ్గిపోతుంది. పరిపాలన విషయంలో నువ్వెంతో నేర్చుకోవచ్చు. ఆ అనుభవంతో నువ్వు నీరాజ్యాన్ని పరిపాలించితే, మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉంటుంది నీ రాజ్యం. నీ ఏలుబడిలో ఉన్న సమస్త జీవసంతతీ జీవితాన్ని, పుష్కలంగా, సమగ్రంగా, తీవ్రంగా, అనుభవించ గలుగుతుంది. అటువంటి అపూర్వానుభవాన్ని నువ్వు, నీదేశ వాసులకు ఎందు కివ్వగూడదు? వారిని ఇలానే మూర్ఖంగా ఉంచి పాలించడంకన్న, వారిని విజ్ఞానవంతుల్ని చేసి, అదే మేరకు నువ్వూ అభివృద్ధి పొందవచ్చు. అయితే — 'ఇప్పుడు నాపాలన సక్రమంగా లేదా?' అని నువ్వడగొచ్చు. ఉన్నా,

ఇంతకన్న ఉత్తమంగా ఉండటంలో తప్పులేదు. అవును గదా ?' అన్నాడు నారదుడు.

సింహరాజు మాట్లాడ లేదు.

'నా మాటలు నీకు రుచించకపోతే, వినడం మానెయ్యి. అయితే అందువల్ల నష్టపడేది నువ్వేనన్న విషయం మరిచి పోకు. ఇందులో తప్పులేదు. మంచి విషయాన్ని అనుకరించడం అంటే, అది మంచిపట్ల మనకున్న ఆసక్తిని తెలియచేస్తుంది గానీ, అవమానాన్నివ్వదు. అయినప్పుడు నువ్వు సందేహించడంలో అర్థమేమిటో నాకు తెలియకుండా ఉన్నది' అన్నాడు నారదుడు.

'స్వామీ !' అన్నాడు సింహరాజు. 'తమరు నాకు ఉత్సాహాన్నయితే యిచ్చారు. అది తీర్చుకునే మార్గం చూపించ లేదు. మానవ జీవితాన్ని పరిశీలించాలని నేను చాలా ఉత్సహిస్తున్నాను. అయితే అందుకు బోలెడన్ని అవరోధాలున్నాయి. ఇదైనా మా పూర్వులు చెప్పిన విషయాలనుబట్టే సుమా నేనంటున్నది. ఒకప్పుడు, మాకూ మానవులకూ మధ్య వైరముంటూండేది. ఆ సంగతి తమకు తెలియకపోదు. ఈలోగా మానవుడు మారి పోయాడేమో మాకు తెలియదు. కానిపక్షంలో నేనెలా అతని జీవితాన్ని పరిశీలించ గలను ? అందుకు అవకాశ మేమున్నది ? కోరిక ఉన్నంత మాత్రాన లాభం లేదని తమకు తెలుసు. మీకు మా మీద ఆదరం ఉంటే ఆ వీలు గూడా మీరే చూపించి పుణ్యం

కట్టుకోండి. మీ ఋణం జన్మ జన్మాలకూ మరిచిపోను. ఆ అనుభవంతో నేను నా రాజ్యాన్ని పాలిస్తాను. నా దేశీయులు గూడా మీకు ఆ జన్మాంతం కృతజ్ఞతా బద్ధులయి ఉంటారు.'

'చెడ్డ చిక్కు తెచ్చి పెట్టావు' అన్నాడు నారదుడు. 'నిజమే! ఈ విధంగా వెళ్ళడం అంత శ్రేయస్కరం గాదు. అదీగాక, మనిషి తత్వాన్ని తెలుసు కోవాలంటే, మనిషికే అది సుసాధ్య మవుతుంది. దీన్ని బట్టి చూస్తే, నువ్వు మానవ రూపం ధరించడం కన్నా మరోమార్గం నాకు కనిపించడం లేదు.'

'నా అభిప్రాయం గూడా అదేనండీ! తూచినట్టు చెప్పారు.' అన్నాడు సింహరాజు.

'అంతవరకే నేను చేయగలిగిందైనాను. పాపం! ఇంత మనసుపడి అడిగావు గదా అని, నిన్ను మనిషిగా చేదామంటే, అది నాశక్తికి మించిన కార్యమయి కూచుంది. అయినా నువ్వు దిగులు పడకు. బ్రహ్మను గురించి తపస్సు చెయ్యి, ఈలోగా నీకు కావలసిన ఏర్పాట్లన్నీ నేను చూస్తాను. నీ ప్రయత్నం విధిగా జయించి తీరుతుందని నా అంతరాత్మ చెబుతున్నది. వెంటనే నువ్వు కార్యక్రమం ప్రారంభించు. నేను నా ప్రయత్నాల్లో ఉంటాను... కాలాతీత మైంది, నేను వెడతాను.' అన్నాడు నారదుడు. సింహరాజు, సపరివారంగా నమస్కరించాడు.

'ఇష్టఫల సిద్ధిరస్తు ... ఉండండి'

నారదుడు దక్షిణహస్తమెత్తి దీవించాడు. మహతిని అందుకొని, యథేచ్ఛగా వెళ్ళి పోయాడు.

## 2

గత కొన్ని రోజులనుండీ, సరస్వతీ చతుర్ముఖుల మధ్య వచ్చి గడ్డివేస్తే భగ్గు మంటున్నది. ఈ విషయం అందరికీ తెలిసినా, ఎవ్వరూ మధ్యవర్తిత్వం వహించటానికి సిద్ధపడ లేదు. ఒక రిద్దరు సరస్వతికి సర్ది చెప్పబోయి అవమానింప బడ్డారు. ఆ మహాతల్లి ఒక్క పిసరంతయినా, తన పట్టుదలను సడలించ లేదు.

ఈ విషయం నారదులవారికి తెలిసింది. ఇంతకన్నా మంచి అదను మరొకటి లభించ దనుకొన్నాడు. సరాసరి సరస్వతీ ప్రాంగణంలో వాలాడు. సాష్టాంగ దండప్రణామాలు అర్పించాడు. సరస్వతి దీవించ లేదు. లేని సంతోషాన్ని ఒక్క క్షణం మాత్రం ప్రదర్శించింది. ఈ సంగతి నారదుడు గ్రహించాడు. అయినా ఏమీ తెలియ నట్టే నటించాడు.

'అమ్మా! నా కన్ని సంగతులు కింపురుషులు చెప్పారు. మీవంటి పురాణ దంపతుల కీచులాటలు, దేవలోకంలోని మారు మూలలకు గూడా ఎగబాకటం గౌరవం కాదని నా మనవి. .అమ్మా! నాకు తెలుసు. ఇందులో నీ తప్పేమీ లేదు, ఉండదు గూడాను. తండ్రి గారు వయస్సు మళ్ళిన వారు. ముసలితనంలో మనస్సు సరిగా పని చెయ్యక

పోవటం సహజం. అవ్యవస్థిత స్థితిలో నాన్నగారు ఏదోకాని మాట, కొరగాని చేత, చేసే ఉంటారు. అంతమాత్రాన, ముల్లోక పూజ్యులైన మీరిలా కోపగించుకోవటం భావ్యమా? భావ్యమనే మీరు భావిస్తున్నారా?' అన్నాడు నారదుడు.

సరస్వతి కిమ్మన లేదు.

నారదుడు తిరిగి సాగించాడు.

'అదీగాక, నాన్నగారికి మీ శక్తి సామర్థ్యాలింకా తెలియవు. తెలిసివుంటే మీతో ఇలా జగడమాడి ఉండరు. లోకాలన్నీ మీ అమోఘ శక్తికి దాసోహ మంటున్నాయి. మీరే లేకపోతే, నాన్నగారి సృష్టి యావత్తూ మూగమయమయి ఉండేది. పరస్పర సంబంధం లేకుండా, ఘోరాతిఘోరంగా ఊహాతీతంగా ఉండేది. సృష్టిని మీరా అపాయం నుండి రక్షించారు. ఇటువంటి ఘనమైన కార్యం చేశారంటే, మీ ప్రతిభాశక్తు లెటువంటివో ఎవరు మటుకు ఎలా ఊహించగలరు?'

సరస్వతి హాసన్ముఖి అయింది.

'అబ్బి! నాన్నగారిగ్గూడా ఇదే అభిప్రాయం కడుపులో వుందిరా! ఆ మాట ఆయన పైకి అననూ లేరు, లోపల యిముడ్చుకోనూ లేరు. ఈ కక్కు ఏదో విధంగా వెళ్ళబుచ్చుకోవాలాయె. అందుకని, అనవసరంనా గిల్లికజ్జా పెట్టుకున్నారు. ముసలాయన సంగతి తెలిసి, నేనుగూడా సర్దుకొంటూనే వస్తున్నాను. అయినా సహానానిగ్గూడా ఓ హద్దు

తగలడింది గదా? ఎదుటి వారు మౌనంగా ఉండటం, వారి మంచితనానికి చిహ్నమని మీ నాన్న మరిచిపోయారు. కేవలం దౌర్బల్యం వల్లనే ఊరుకొంటున్నానని భ్రమ పడ్డారు. దానితో వ్యవహారం బెడిసి కొట్టింది.' అన్నది సరస్వతీదేవి.

'అమ్మా! ఇది కుటుంబ కలహం లాంటిది. ఇటువంటి సంగతులు బైటికి పొక్కడంవల్ల అనేక చిక్కులొస్తుంటాయి... వృద్ధాప్యంవల్ల నాన్నగారికి మతి భ్రమించిందన్న విషయం, చూచాయగా అందరికీ తెలిసి పోయింది. ఆ కారణాన వారు చేయవలసిన కార్యక్రమం మీరు చేయవలసి వస్తుందని గూడా అందరూ అనుకొంటున్నారు...' అన్నాడు నారదుడు సరస్వతీదేవిని ఉబ్బేస్తూ.

'నిజంగానా?' అన్నది సరస్వతి ఉత్సాహంతో.

'ఇందులో సందేహించ వలసిం దేమున్న దమ్మా? మీకటువంటి సమర్థత లేనప్పుడు గదా అలా అనుకొంటున్న వారిని మనం తప్పు పట్టవలసింది! పాషాణసదృశమైన జంగమ సృష్టిని ఉత్తమ స్థాయికి తెచ్చిన అపూర్వ శక్తివంతురాలవు. కావలిస్తే నువ్వాపాషాణ సదృశ జంగమసృష్టి సృజించలేక పోవు. నీకా సామర్థ్యముంది. అయినా నాన్నగారి మీద గౌరవం కొద్దీ నువ్వూరు కొంటున్నావు గానీ, చేతకాక కాదే!' అన్నాడు నారదుడు.

'అదీ నిజమే!' అన్నది సరస్వతి.

ఆమెగారి అహంకారానికి ఆశ్చర్యపోయినాడు

నారదుడు.

'నే నెందుకు చెబుతున్నానంటే అమ్మా!' అన్నాడు నారదుడు. 'ఇంత సమర్థురాలివని తెలిసీ, యీ పని చేశా డంటే — దాని కర్థంలేదు ... అన్నట్టు అసలు విషయం మరిచి పోయాను. భూలోకంలో సింహరాజనే మిత్రడొకడు నాకు ఉన్నాడు. నువ్వంటే అధికమైన భక్తి ప్రపత్తు లున్న వాడు. నీ కటాక్షం కావాలని, అహరహం, మహా బాధపడిపోతు న్నాడు. అతనికి వాక్కు ప్రసాదించ రాదా?'

'జంతువుకు వాక్కేమిట్రా అబ్బీ?'

'ఈ విషయమే నేనూ అతనికి చెప్పాను తల్లీ! అయినా అతను వినిపించుకో లేదు, నాకు మల్లేనే నీ శక్తిమీద అతనికీ తిరుగులేని విశ్వాసముంది.'

'అయితే మట్టుకు?' అన్నది సరస్వతి.

'అది మీ యిష్టం. అతనికి మీ పట్లగల నమ్మకాన్ని వమ్ముచేసు కొంటానంటే నేను కాదనను గానీ, విచారిస్తాను. ఎందు కంటే, రేపటినుండీ అతను మీకు తాటాకులు కట్ట నారంభిస్తాడు. అందుకు నువ్వు సిద్ధపడితే, నాకేమీ అభ్యంతరం లేదు' అన్నాడు నారదుడు.

'పోనీ అలాగే ప్రసాదిస్తాను. ఇంతలో యేం పోయింది గనుక' అన్నది సరస్వతి.

నారదుడు వాణి వద్ద సెలవు తీసుకొన్నాడు. వాణి అప్పటికప్పుడే సింహరాజుకు వాక్కును ప్రసాదించింది.

బ్రహ్మదేవుడు ఏకాంత మందిరంలో ఉన్నాడనీ, కొన్ని రోజుల నుండీ ఎవ్వరికీ దర్శన మివ్వడం లేదనీ, ఎవరొచ్చినా వాకిట్లో నుండే వెనక్కు పంపేయ మన్నాడనీ ద్వారపాలకుడు చెప్పాడు.

'నువ్వు చెప్పింది సబబుగానే ఉందిరా అబ్బీ! ఎవరికీ దర్శనమివ్వక పోవడమూ, ఎవరొచ్చినా వెనక్కు పంపివేయ మని నీకాజ్ఞ ఇవ్వడమూ నాకు తెలియ దంటావా? తెలియకనే లోపలి కెడతా ననేంత మూఢుణ్ని కానుగదా! వారు నాకోసమే ఎదురు చూస్తున్నారు. వారు కబురు చేస్తేనే వస్తున్నాను. కావలిస్తే నా వెంట రా రుజు విప్పిస్తాను. లేదూ — వెళ్ళ మంటావా? నిరభ్యంతరంగా వెడతాను. చివాట్లు తిన వలసిన రాత నీకుంటే నేనెలా తప్పించ గలను?' అన్నాడు నారదుడు.

ద్వార పాలకుని పని ఇరుకున పడినట్లయింది. ఏదైతే అది అవుతుందని నారదుణ్ని లోనికి ప్రవేశించనిచ్చాడు. నారదుడు లోపలి కొచ్చేసరికి అంతా అయోమయంగా వుంది. బ్రహ్మదేవుడు ఒకచోట కూచుని నాల్గు ముఖాలు దించుకొని ఉన్నాడు. నారదుడు అల్లంత దూరాన ఉండే అభివాదం చేశాడు. బ్రహ్మదేవుడు అయిష్టంగా దాన్ని స్వీకరించాడు.

'మహాభాగా!' అంటూ ప్రారంభించాడు నారదుడు. 'అదేమి చిత్రమోగాని, లోకంలో కష్టాలన్నీ మంచి వారినే

చుట్టు ముడుతుంటాయి. మోసగాళ్ళు, దొంగలు, కల్మ షాత్ములు, ఈర్ష్యాపరులు, సర్వసుఖాలు అనుభవిస్తుంటారు. అన్నిటా వారికి కొదవ వుండదు. వారి కత్తి కెదురు లేదు. వారి మాట శాసనంగా చెల్లు బాటవుతుంటుంది. ఈ పరిస్థితికి కారణ మేమిటంటారు?'

'నాకు తెలీదు' అన్నాడు విరించి విసుగ్గా.

'అలాగని మిమ్మ మీరు మోసపుచ్చుకోకండి తండ్రీ! ఆత్మవంచనతో ప్రారంభమైన ఈ జబ్బు, లోక వంచనదాకా విస్తరిల్లుతుంది. ఆత్మవంచనవల్ల నష్టపడేది, అలా వచించుకొన్న వారే! కాని లోకవంచనవల్ల, లోకమంతా నష్టపడక తప్పదు. సృష్టికారకులైన మీవంటి మహాభాగులు, తమ సృష్టియే ఇలా నష్టపోవడాన్ని కాంక్షిస్తారా?' అన్నాడు నారదుడు.

'ఏమిటి కధ?' అన్నట్టు చూశాడు బ్రహ్మ.

'స్వామీ! మీకు నేను చెప్పదగను, అయినా చెప్ప కుండా ఉండలేక పోతున్నాను. లోకంలో కట్టుబాట్లు సన్న గిల్లి పోతున్నాయి. దీనికి బీజం దేవ లోకంలో - అందునా మన కుటుంబంలో - వుండటం విచారకరం. అయినా ఇవన్నీ నా కనవసరం. కావలసిన మీరే ఇలా నిమ్మకు నీరెత్తిన ట్లున్న ప్పుడు; మధ్య నాకా తలవంపులు! మీరు శాంత చిత్తులనే విన్నాను గానీ, అమాయకులని ఇంతవరకూ వినలేదు. ఇప్పు డా మాట కూడా విన్నాను. విని రుజువు గూడా చేసు కొన్నాను.' అన్నాడు నారదుడు.

బ్రహ్మ తేలు కుట్టినట్లు వులిక్కి పడ్డాడు. నాలుగు నోళ్ళతోనూ ఆవలించి చిటికెలు వేశాడు. మత్తు వదిలేలా వళ్ళు విదిలించుకొని లేచి నిలుచున్నాడు. నారదుని కెక్కడా లేని సంతోష మేసింది.

'ఏమిటీ ? నేను అమాయికుణ్ణా ? అమాయికుణ్ణయితే యింత సృష్టి ఎలా చేశానంటావు ? ఇన్ని చిత్ర విచిత్రాలు ఎలా కల్పించా నంటావు ? ఎవరో మూర్ఖులు అనవలసిన మాట నువ్వంటా వేమిటోయ్ !' అన్నాడు బ్రహ్మ రవంత కోపంతో.

'స్వామీ ! తమరు పరాకు చిత్తగిస్తున్నారు' అన్నాడు నారదుడు లోలోపల హర్షిస్తూ. 'అమాయికులని నేను నిరాధారంగా అనలేదు. అమాయికులు కాకపోతే మరొక రెవరన్నా తమ పనిలో ఎదటివారు జోక్యం కల్పించుకోవడాన్ని సహించ గలరా ? మీ ప్రజ్ఞ గవ్వకు కొరగాదని ఊరూవాడా ప్రచారం సాగిపోతుంటే, ఇలా చూస్తూ ఊరుకొనేవాడు అమాయకుడుగాక, మహా మనీషి అవుతాడా ? మీరే చెప్పండి !'

'ఎవరా ప్రచారం చేస్తున్న దుర్మార్గులు ?' అన్నాడు బ్రహ్మ.

'ఎవరో అయితే నేనూ ఇంత విచారించక పోదును. పూజ్యులైన తల్లిగారే ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు.'

'నిజంగానా ?' అన్నాడు బ్రహ్మ ఉలిక్కిపడి.

'ఇందులో ఆశ్చర్య పడవలసిం దేమున్నది తండ్రీ! అమ్మగారికి, మీకు మధ్య వైర బీజం మొలకెత్తింది. అది సమసి పోవడానికి బదులు ఏపుగా పెరిగి విష ఫలితాలివ్వ సాగింది. ప్రస్తుతం మీరు అమ్మగారికి శత్రుస్థానంలో వున్నారు' అన్నాడు నారదుడు.

'అయితే!' అని రెట్టించాడు విధాత.

'శత్రువును జయించటానికి అనేక మార్గాలున్నాయి తండ్రీ! అందులో ఎదటి వాడికి ఏమీ తెలీదని, శుద్ధ తెలివి తక్కువవాడనీ, ప్రచారం చేయడం వకటి. అందువల్ల ఎదటి వాడికి ప్రజల్లో ఏకాస్తంత గౌరవమన్నా వుంటే - అది పునాదులతో సహా కదల నారంభిస్తుంది. దానికి తోడు వాడు చేసే పనులన్నీ అపభ్రంశాలుగా వుంటాయని నిరూపించడానికి గాను, తీవ్రస్థాయిలో ప్రయత్నాలు ప్రారంభమవుతాయి....' అని ఆగిపోయాడు నారదుడు.

బ్రహ్మదేవుని ఆరాటం జాస్తి అయింది. కాలూ చెయ్యీ ఆడలేదు. ఉంగిడి తగిలినట్లు విల విల లాడి పోయ్యాడు. తనకు తెలియకుండా ఏదో కుట్ర; అదిన్నీ బ్రహ్మాండమైన స్థాయిలో జరుగుతోందని భావించాడు. ఇద మిత్థమని, తను నిర్ణయించలేక పోతున్నాడు. అంత మాత్రాన కుట్ర జరగడం లేదనుకోనేందుకు లేదు. రుజువు చేయలేక పోవడం, తన బలహీనతను మాత్రమే తెలియ జేస్తుంది. నారదుడి సంగతి తనకు తెలియనిది కాదు. అస

త్యాలు చెప్పడన్న మాటేగానీ, సత్యానికీ, అంతగా వక్రభాష్య మివ్వగలవాడు మరొకడు లేడు. ఇది నిజమే అయినప్పటికీ, నారదుని మాటలు విశ్వసించక పోవడానికి, తనకు సరైన కారణాలు లేవు. అవి అసత్యాలని, ఈ క్షణాన తను నిరూపించలేడు. అలా నిరూపించగలిగే వరకూ, వాటిని సత్యాలుగానే భావించాలి. అందువల్ల కొన్ని నష్టాలు కలిగే మాట నిజమే! కానీ లాభాలుగూడా అపారంగా వుంటాయి. అపారమైన లాభాల కోసం, కొద్ది నష్టాలను భరించటంలో తప్పు లేదు....ఎందుకోగానీ, ఈ నిమిషాన నారదుడు తనకు అత్యంత సన్నిహితుడుగా కనిపిస్తున్నాడు; ఇందులో అతని కెంతో కొంత స్వార్థం వుండవచ్చు. అయినా....ఒక వేళ, తను అరాజక పరిస్థితుల్లో జీవిస్తున్నాడు. ఈ ఆపత్సమయంలో, ఎవరు కనిపించినా, ఆప్తులు కనిపించినట్టుగా ఉండటమే సహజం గనుక, అలా కనిపిస్తున్నాడేమో?....

'తండ్రీ! ఏమిటి దీర్ఘంగా ఆలోచిస్తున్నారు? నామాట మీద తమ కంతగా నమ్మకం లేకపోతే, ఒక్కసారి భూలోకం లోకి చూడండి. సత్యాసత్యాలు మీకే అవగత మౌతాయి' అన్నాడు నారదుడు.

బ్రహ్మ – రవంత వివేకం ఉపయోగించి, ఆలోచించి ఇలా అన్నాడు. 'బాబూ! నీ మీద నాకు నమ్మకం లేకపోవడ మంటే, నా మీద నాకే లేకుండా పోవాలి' అని మాత్రం అన్నాడు. అప్పుడే భూలోకంలోకి చూడటం వలన అనేక

చిక్కులో స్తాయని బ్రహ్మ ఆలోచించాడు. ముందు నారదునికి కోపం వస్తుంది. అందువల్ల తనకు తెలియవలసిన రహస్య విషయాలు కొన్ని తెలియకుండా పోతాయి. ఇలాంటి ఆపత్సమయంలో, తను శత్రురహస్యాలకు దూరం కావడమంటే, అపజయాన్ని చేజేతులా కొని తెచ్చుకోవడమే! అందుకే తను వివేకంగా ఆలోచించి, వివేకంగానే మాట్లాడాడు...

'జనకా!' అన్నాడు నారదుడు- అదోకలా గొంతు పెట్టి. 'మీరేమయినా అనుకోండి. మీ సృష్టిలోకల్లా, అధమాధమ జీవి స్త్రీ. అందుకు ఉదాహరణగా తల్లిగారినే చూపించవలసి వచ్చినందుకు మహా బాధ పడిపోతున్నాను...ఆడదానికి బుద్ధిలేదు. ఉన్నా దానిని ఉపయోగించదు. కాకపోతే, ఏదో గృహ సంబంధంగా వచ్చిన మీ కీచులాటను పురస్కరించుకొని ఇలా మీపై కత్తి కడుతుందా? మీరు పొందే గౌరవాగౌరవాలలో, తనకూ భాగస్వామ్యం ఉంటుందని తల్లిగారికెందుకు తోచక పోవాలి? పోనీ, కోపతాపాన ఏదో అనుకోవచ్చు, అననూ వచ్చు, తప్పు లేదు. కానీ తన కోపాన్ని తీర్చుకొందుకు హరిహరులతో చేతులు కలపడం భావ్యం కాదు. సమయం కోసం కనిపెట్టుకొని ఉన్న హరిహరులు, తల్లిగారిచ్చిన ఈ అవకాశాన్ని చక్కగా వినియోగించుకొన్నారు. తమ విషవ్యూహం పన్నడానికి, ఇంతకన్న మంచి అదను లభించదనుకొన్నారు. ఉన్నవీ లేనివీ తల్లిగారికి నూరిపోశారు. విచక్షణా రహితంగా వాటన్నింటికీ తల్లిగారు ఆమోదముద్ర

వేశారు. వారిని, నామకః వుంచి, నాటకమంతా తామే ఆడుతున్నారు...నాకు పట్టుకొన్న విచారమల్లా ఒక్కటే! హరిహరాదులు శత్రుకూటస్థులు గనుక, వారేమీ చేసినా మనం తప్పు పట్టజాలము. తల్లిగారి కెలా తోచలేదో నాకు తోచటం లేదు...'

బ్రహ్మదేవుడు కను లింత చేసుకొని వింటున్న వాడల్లా 'ఏమీ చేసింది?' అని మాత్రం అతి ప్రయత్నం మీద అనగలి గాడు.

'స్వల్ప కార్యాలు ఎన్ని చేసినా నేను లక్ష్యపెట్టక పోదును. వారు మీ ప్రతిభకే - అంటే—సృష్టికే వైపరీత్యాలు కల్పింప జూస్తున్నారు.'

'చూస్తున్నారే గానీ, ఇంకా చేయలేదు గదా!'

నారదుడు నిట్టూర్చాడు,

'అంతా అయిపోయింది. ఆ మహా కార్యానికి ఇప్పుడే ప్రారంభోత్సవం జరిగింది. మీరు పూనుకొని మొగ్గలోనే త్రుంచి వేయటం అన్ని విధాలా శ్రేయస్కరం. చేయిమించిన తరువాత మనం చేయగలిగిందేమీ లేదు' అన్నాడు నారదుడు.

'అయితే నేనూ సిద్ధంగా ఉన్నాను.... అసలు జరిగిం దేమిటి నాయనా! సాకల్యంగా చెప్పు' అని ప్రాధేయ పడ్డాడు బ్రహ్మ.

'వాక్కు మానవులకే గానీ, తదితర జీవకోటికి లేదు గదా!'

'లేదు.'

'అమ్మగారు జంతుజాలానికి గూడా 'మాట' ను ప్రసాదించారు. జంతువులు మానవ భాషను మాట్లాడటమంటే, అంతకన్నా తమ సృష్టి నగుబాట్లు కావడానికి ఎక్కువ కారణాలు అనవసరం! మీకు మతిచెడిందనీ, అందువల్లనే ఇలాంటి విచిత్ర జీవులను సృష్టిస్తున్నారనీ, ప్రచారం చేసుకొందుగ్గాను, హరిహరులు ఈ పన్నాగం పన్ని, తల్లిగారి ద్వారా మొదలు పెట్టారు. దీని కెటువంటి ప్రతిక్రియ ఆలోచిస్తారో ఆలోచించండి' అన్నాడు నారదుడు.

'ఓస్. ఇందుకోసం పెద్దగా ఆలోచించాలా? ఆ 'వాక్కు' ను తిరిగి తీసేస్తాను. సరిపోతుంది.'

'కాని' అని నారదుడు ముసిముసి నవ్వులు నవ్వాడు. 'తొలిగించే హక్కు మీకులేదు తండ్రీ! ఎవరు ప్రసాదించిన వరాలు, వారే వుపసంహరించుకోవాలనీ, మరొకరు వాటిని పట్టించుకో గూడదనీ, అలా జోక్యం కలిగించు కోవడం అక్రమమనీ, మన దేవ రాజ్యాంగ చట్టం ఉద్ఘోషిస్తున్నది' అన్నాడు నారదుడు.

'అయితే జంతువులు, ఇకనుండి మానవభాష మాట్లాడడమే!' అని రిచ్చపడ్డాడు బ్రహ్మ.

'ఆహా!' అన్నాడు నారదుడు. 'అలా జరగకుండా ఉండాలంటే సరస్వతీ అమ్మగారి సహాయం కావాలి. ఇప్పట్టున అది మనకు సులభంగా లభిస్తుం దనుకోను. మీరు వెళ్ళి, తమా

క్షమ నర్థించితే, కొంత ఫలితం ఉండవచ్చు.'

'ఆఁ' అని మండి పడ్డాడు బ్రహ్మ, 'ఇంతసేపూ నాకు హితోపదేశం చేసింది ఇందుకా?' అన్నాడు. 'ఇన్ని లోకాలను, సృష్టించిన నేను, ఒక ఆడదాని దగ్గర కెళ్ళి, అందులోనూ భార్య దగ్గర కెళ్ళి, క్షమ నర్థించడం, ఊహించనన్నా ఊహించలేనే?' అన్నాడు. నారదుణ్ని నానా మాటలూ అన్నాడు. అయినా నారదుడు కోపగించుకోలేదు. పై పెచ్చు పొంగి వస్తున్న నవ్వును అణుచుకొంటూ ఇలా అన్నాడు-

'నేను చెప్పింది ఒక పద్ధతి. ఇది నయమార్గం. ఈ పద్ధతి మనకు అంగీకార యోగ్యం కాకపోతే, మరొక దోవ చూసుకొందాం .... మరేం లేదు, తల్లిగారు ఏ యే జంతువులకు వాక్కు నిచ్చారో, ఆ యా జంతువులకు - ఆ మాటకొస్తే ప్రాణులకు — మీరు మనుష్యత్వ మివ్వండి. ఇంతకన్నా నిరపాయకరమైన మార్గం నాకు గోచరించడం లేదు. మీకు స్ఫురిస్తే చెప్పండి. తక్షణమే ఆచరిద్దాం.'

బ్రహ్మదేవుడు కొన్ని క్షణాలు ఆలోచించాడు.

'నాకేమీ తోడచం లేదు. ఇంతకన్న మంచి పద్ధతి దొరికే వరకూ, ఈ పద్ధతినే అనుసరిస్తే...అయితే - ఇందువల్ల రాజ్యాంగ రీత్యా చిక్కు లేమీ రావు గదా?' అన్నాడు బ్రహ్మ.

'చిక్కులా?' అన్నాడు నారదుడు. 'వాటికి ఆస్కారమే లేదు. అయినా మీ రెవరి హక్కులకు భంగకరంగా

ప్రవర్తించారు గనుక, రాజ్యాంగం మీ మీద చర్య తీసుకొంటుంది? అదేమీ లేదుగదా? అయినప్పుడు రాజ్యాంగ ప్రసక్తే ఇందులోకి రానవసరం లేదు.'

'అఁహ .... నేననేది అదిగాదు. 'ఆవిడ'గారు ప్రసాదించిన హక్కుకు, మనం ఇంకో రూపంలో భంగం కలిగిస్తున్నామేమోనని, నా అనుమానం' అన్నాడు బ్రహ్మ.

'ఆ లెక్క ప్రకారం చూస్తే ప్రథమ దోషి తల్లిగారు కావలసి వస్తుంది. జంతువులకు వాక్కు నివ్వటం చట్టరీత్యా తప్పు. ముందు-జవాబివ్వవలసిన బాధ్యత తల్లిగారిది, మనది గాదు.' అన్నాడు నారదుడు.

'ఇది ఆవిడకు లొంగిపోవడం కాదు గదా ?'

'కాదు. కాకపోగా, ప్రచండమైన ప్రతిక్రియ అవుతుంది. దీనికి, తల్లిగారు, హరి హరాదులు ఏమి సమాధానం చెబుతారో చూడవలసి ఉంది...'

'అసలు — నాకు మానవజాతి పట్ల, విపరీతమైన అసహ్యముంది. తప్పనిసరి అయి, ఇంకొందరు మానవులను, కల్పిస్తున్నాను. ప్చ ... ఏమిటో ... అర్థం లేదు' అన్నాడు బ్రహ్మ, తనలోతను అనుకొంటున్నట్టు. నారదుడేమీ మాట్లాడ లేదు.

* * *

'స్వామీ! తమరు పరధ్యానంగా ఉన్నారు.'

నారదుడు వులిక్కి పడ్డాడు. ఒక్క క్షణం ఎగాదిగా

చూశాడు.

'నిన్ను గుర్తించలేక పోతున్నాను. నాయనా ఎవరు నువ్వు?'

స్వాములు మహర్షులయినా హాస్యరస ప్రియులే సుమా.'

'హాస్యమా? నీతో నా?' అన్నాడు నారదుడు ఆశ్చర్యంగా.

'కాక, ఇది నిజమని ఎలా అనుకోను స్వామీ! ఎంతో ఆదరంతో నన్ను చేరదీసి, మరెంతో అనురాగం నా పట్ల ప్రదర్శించి, జాంతవికత్వం నుండి, ఈ మానవరూపం నాకు ప్రసాదించారు...'

'ఓరి' అని ఆశ్చర్య పడ్డాడు నారదుడు. 'నువ్వు సింహరాజువా? గుర్తించలేక పోయాను సుమీ?'

'అంతా తమ కటాక్షం. మీరు తలుచుకోక పోయినట్లయితే, ఈ మహదవకాశం, లభించేది కాదు. ఈ అవకాశాన్ని నేను సద్వినియోగం చేసుకో గలనని మనవి. యుగయుగాల నుండీ - మీ మాట ప్రకారం మానవుడు అనుభవించి, నేర్చుకొన్న విజ్ఞానం, అవలోడనంచేసి, ఆ సంస్కారంతో, అరణ్యారాజ్యాన్ని పరిపాలిస్తాను. మానవుడు సుదీర్ఘ కాలంలో గడచిన దశల నన్నింటినీ నా ప్రజలు స్వల్ప కాలంలో అధిగమించేలా చూస్తాను. అదీగాక, ఒకప్పుడు మానవుడు చేసిన తప్పిదాలను, అందువల్ల పొందిన ఘోర ఫలితాలను, మావారు

చవిచూడ నవసరం లేదు. వేలాది సంవత్సరాల తాలూకు జీవి తానుభవం తీవ్రంగా మా వారు అనుభవంలోకి తీసుకో గలరు. సమస్త జంతు కోటీ, మీకు తరతరాల ఋణపడి ఉంటుంది.' అన్నాడు సింహరాజు !

'అసాధ్యుడివి !' అన్నాడు నారదుడు. 'ఈ మహత్తర మైన కార్యానికి నన్ను కారణంగా పేర్కొంటున్నావు. నిజ మేమిటంటే - నేను కేవలం నిమిత్తం మాత్రుణ్ని. వాస్త వంగా, ఇందులో నా పాత్ర గూడా ఏమీ లేదు. పరిస్థితులు అలా అనుకూలించాయి. నీ వాంఛ నెరవేరింది. అంతే !'

'పూజ్యులు పొగడ్తల నందుకోడాని కిష్టపడరు. అయితే నేను, నా కృతజ్ఞతను దాచుకోలేను. దీవించండి.' అని శీర్షం వంచాడు సింహరాజు.

'దీవనల్లో నాకేమీ నమ్మకం లేదు.' అన్నాడు నార దుడు. 'అయినా నువ్వు కోరావు గనుక, నీ మాటను కాదన లేక పోతున్నాను.'

'ధన్యుణ్ని' అన్నాడు సింహరాజు.

3

కొన్ని రోజులపాటు నడిస్తేగాని సింహరాజు అరణ్యాన్ని దాటలేక పోయాడు. నిజానికి తనకింత విస్తీర్ణంగల రాజ్య మున్నదనిగూడా తెలియదు. కావటానికి — ఇలా తెలీకపోవడం లోపమే ! అయినా విశ్వాసం గల కార్యోద్యో

గులున్నారు గనుక, ఆ లోపం బైట పడలేదు. కాకపోతే తను ఎంతో అభాసుపాలు కావలసి వచ్చేది. ఎందరికో ఎన్నో విధములైన అన్యాయాలు చేయవలసి వచ్చేది. (ఈ చివరి నిర్ణయానికి కారణం సింహరాజు చెప్పుకోలేక పోయినాడు.) అయినా ఇప్పుడవన్నీ అనవసరం! తను మానుష రూపు నెత్తాడు. ఈ రూపంలో వుండి, యుగాలతరబడి పరిణామం చెందుతూ వచ్చిన మానవానుభవాన్ని గ్రహించబోతున్నాడు. గతించిన దేదో గతించింది. దానిని తను బాగుచేయలేడు. కనీసం యిక ముందునుండైనా అటువంటివి జరుగకుండా చూడాలి. అలా చూసే ప్రయత్నానికి ఇది - కేవలం నాందీ ప్రస్తావన వంటిది. భగవంతుని దయవల్ల తను చేస్తున్న ఈ ప్రయత్నం సఫలమైతే ...

సఫలమైతే ఏమి జరుగుతుందో సింహరాజు ఊహించలేక పోయినాడు; సరిగదా, నిరాధారమైన మరికొన్ని ఆలోచనలు గూడా వచ్చాయి. అతని కింతవరకూ, తను మరొకరికి అన్యాయం చేశానని గానీ, చేయగలననిగానీ స్ఫురించనే లేదు. తనేమి చేసినా న్యాయమేననీ, అసలు న్యాయ సమ్మతమైనవే తను చేస్తుంటాననే నమ్మకం సింహరాజు కుండేది. మానవరూపం పొంది, అరణ్యాన్ని దాటగానే, తను కొందరికి, అన్యాయం చేసి ఉంటానన్న తపన సింహరాజు కేర్పడింది. ఇందుకు కారణం సింహరాజు చెప్పలేడు. బహుశః ఇది మానవరూప మెత్తిన ఫలితం కావచ్చు! ఎందుకంటే, తన మీద

తనకైనా, సంపూర్ణ విశ్వాసంలేని ప్రాణి మానవుడే!

సింహరాజు అరణ్యాన్ని దాటి కొన్ని గంటలు ప్రయాణం చేశాడు. దూరంగా జనపదం కనిపించింది. ప్రప్రథమంగా మానవ నాగరికతలోకి అడుగు పెడుతున్నానన్న భావం, అతన్ని ఉత్తేజితం చేసింది. ఆనంద వాహిని నరనరాలా ప్రవహించింది. గబగబా అడుగులు వేయసాగాడు. అదీ గాక అతన్ని ఛుత్తు పట్టి పల్లార్చుతున్నది. ఆ బాధ తీర్చుకొనేందుకు, ఒక సారి ప్రయత్నం చేసి గూడా మానుకొన్నాడు. దాపులోనే లేడి పడుకొని నెమరు వేస్తున్నది. సింహరాజు గర్జన చేశాడు. లేడి, ఒక్కసారి తలత్రిప్పి చూసింది. కదల లేదు. మెదల లేదు. సింహరాజు ఆగ్రహావేశుడైనాడు. హుంకరించాడు. తనలాటి మహారాజు గర్జించినా, లక్ష్యపెట్టని ఈ లేడి, రాజ్యంలోనిదేనని చెప్పుకొనేందుకు గూడా సిగ్గువేస్తున్నది. అయితే, తన పరిపాలన ఇంత అధ్వాన్నంగా ఉన్నదన్న మాట. అనుచిత ప్రవర్తనకుగాను (ఏమిటో అది?) ఈ లేడిని శిక్షించాలన్న సత్సంకల్పంతో, గాండ్రించి మీదికి దూకాడు. లేడి చివుక్కున లేచి, లాగి తన్ని పారి పోయింది. సింహరాజు బాధతో వెనుకకు తూలి పడ్డాడు. అప్పటిగ్గానీ, తను మానవ రూప మెత్తానన్న స్పృహ రాలేదు. ఇంతసేపూ తను జంతువుగానే ఉన్నాననుకొని, ఆలోచించాడు. ఎంత పొరబాటు!

ఆ కారణాన సింహరాజుకు తిండి దొరక లేదు. ఈ రూపంలో వుండి, జంతువులను వేటాడా లనుకోవటం కన్న,

మతిలేని పని మరొక టుండదు. అథవా, తనకా సంకల్ప మున్నా, అలా చెయ్యటానికి అవయవాలు పని చెయ్యావు గదా! ఈ రూపంలో వున్నంతకాలమూ మనస్సును మాంసం మీదకు పోనివ్వ కూడదు. కష్టమో నిష్టురమో ఇది అనుభ వించ వలసిందే!

అప్పటికి చాలా ప్రొద్దెక్కింది. ఎండ మిటమిట లాడు తున్నది. నడచి నడచి ఉండటం మూలాన సింహరాజు బహుగా నీరసించి పోయినాడు. అందులోనూ ఒక వేపు ఆకలి వేపుకు తింటున్నది. పాదరక్షలైనా లేని కారణాన అడుగు తీసి అడుగు పెట్టలేక పోయాడు. కళ్ళు చీకట్లు కమ్ము తున్నాయి. దాపులోనే తోట కనిపించింది. ముందు అక్క డకు చేరి కాస్త విశ్రాంతి తీసుకొందామనీ, ఎండ తగ్గిన తరు వాత గ్రామంలోకి వెడదామనీ సింహరాజు తలపోశాడు.

నిజమే! ఆ తోట చాలా పెద్దది. రకరకాలైన ఫల వృక్షాలు ఫల భారంతో ఊగిస లాడుతున్నాయి. ఆ వృక్షా లను చూడటంతో, సింహరాజు ఆకలి శతాధికమైంది. దిగుడు బావిలో దిగి, కరచరణ ప్రక్షాళనం ముగించాడు. రెండు పుడి సెళ్ళ నీరు త్రాగాడు. ప్రాణం రవ్వంత తేరుకొన్నది. మెల్లిగా వద్దు కొచ్చి, ఒక చెట్టును సమీపించాడు. ఫలభారంతో శాఖలు, నేలబారుగా వంగాయి. సింహరాజు ఆత్రంగా, నాలుగైదు కాయలు తుంపుకొని తిన్నాడు.

క్షుద్బాధ కొంత శమించింది.

'ఎవరక్కడ ?'

సింహరాజు చుట్టూ ఓసారి కలియ చూచి, మరో చెట్టు నుండి, మరో నాలుగు కాయలు తెంపుకొన్నాడు.

'పిలుస్తుంటే పలకవేం ? ఎవరు నువ్వు ?'

'ఈ ధ్వని ఎక్కడిదా' అని సింహరాజు ఓ క్షణం చూశాడు.

'అలా చూస్తావేం ? ఎవరునువ్వు ? అసలీ తోటలో కెందుకొచ్చావ్ ?'

దాపులో వినపడడం వల్ల తననే అను కొన్నాడు సింహరాజు. అనుకొని, ఈ సారి జాగ్రత్తగా చూశాడు. దాపులో నిలువుటెత్తు కర్ర తో ఒక 'మనిషి' నిలబడి వున్నాడు. ప్రప్రథమంగా మానవ దర్శనం, ఇలాంటి చోట లభించినందుకు మురిసిపోయాడు సింహరాజు.

'ఇక్కడెంతో హాయిగా ఉంది.'

ఇంకా ఏదో అనబోతున్నాడు సింహరాజు.

ఆ మనిషి గుడ్లెర్ర చేశాడు.

''ఉంటుందిరా తొత్తుకొడకా ఉంటుంది. తేరగా మంది సొమ్మొచ్చి పడుతుంటే ఉండకేం చేస్తుంది!...ఎవడ్రా నువ్వు ? ఎందుకొచ్చావురా ఇక్కడికి ? నిజం చెప్పు. లేకపోతే చంపుతాను' అన్నాడు మనిషి.

నిజం చెప్పడానికి సింహరాజు జంకాడు. (ఎందుకు ?) అయినా ఏదో వొకటి చెప్పాలి గనుక గొంతు విప్పాడు.

'మాది చాలా దూర దేశమండీ! ఇక్కడి కొచ్చేసరికి చాలా ప్రొద్దెక్కింది. ఎండలో నడవలేకపోయాను. అదీగాక ఆకలి దహించుకు పోతున్నది. మధ్యే మార్గంలో ఇలాంటి చల్లని పండ్లతోట వేసింది మీరేనా?' అన్నాడు సింహరాజు.

'నీ బోటి వాళ్ళకోసం...'

'అదే అనుకొన్నాను' అన్నాడు సింహరాజు. 'హాయిగా నీళ్ళు త్రాగాను. కడుపునిండా కాయలు తింటు న్నాను. ఇంతలోకే మీరు వచ్చారు. భగవంతుడు మిమ్ము రక్షించు గాక!'

మాట పూర్తిగాక ముందే, దభీమని క్రిందపడ్డాడు సింహరాజు. అవతల మనిషి కొట్టిన దెబ్బకు దవడ ఫెడేలు మంది.

ఏమీ తోచక, ఇందులో తన అపరాధ మేమిటో తెలియక, దిక్కులు చూస్తున్నాడు సింహరాజు.

'డొక్క బద్దలు చేస్తాను వెధవా! ఫో ముందు....ఈ తోట నీ బాబుగాడి సొత్తనుకున్నావుట్రా? బోలెడంత డబ్బు పోసి ఈ తోటను కొన్నది, నువ్వు తిని పోవడానికా?' అన్నాడు మనిషి.

ఈ మాటతో సింహరాజు దిమ్మెర పొయ్యాడు. అతని నోటంట మాట రాలేదు. ఎన్నో సందేహాలు సింహరాజులో మొలకెత్తి సమాధానం కోసం విలవిల లాడాయి.

తినడానికి కాకపోతే ఈ తోట ఎందుకు వేసినట్టు?

వృథాగా పారేయడం కోసమైతే, యీ తోట కోసం ఇంత శ్రమపడడం దేనికి? శ్రమ పడనిదే, ఇన్ని ఫల వృక్షాలు ఒక చోట వుండడం అసంభవం గదా! ఎవరో ఒకరు తిని తీరవలసిన యీ పండ్లు తనే తింటే ఏం? అదీగాక తన కిప్పుడు తినవలసిన అవసరం ఉన్నది గదా? ఆ అవసరాన్ని తీర్చుకోవడంలో తప్పేమిటి? ప్రస్తుతం అవసరం వున్న తనకే వీటిని తినే హక్కు లేనప్పుడు, ఇంకెవరి కుంటుంది? ఇత్యాదయః!

ఈ సందేహాలన్నీ బయట పెట్టిన తరువాత ఆ మనిషి శాంతించ లేదు సరిగదా ఆగ్రహోదగ్రుడైనాడు.

'వెధవా! సాయంత్రదాకా, చెట్లకు నీళ్ళు తోడు, నీకదే శిక్ష.'

సింహరాజు, విధి లేక సాయంత్రం వరకూ, చెట్లకు నీళ్ళు తోడాడు. అలవాటు లేకపోవటంవలన, చేతులు బొబ్బలెక్కాయి. శరీరం బరువెక్కి కదలనంటోంది. కళ్ళు ఊడి పడబోతున్నాయి. తోడలేక ఆగిన ఒకటి రెండు సార్లు, మనిషి నానా మాటలూ అన్నాడు. ఇంకోసారి కొట్టినంత పనీ చేశాడు.

ప్రొద్దు కూకింది. మనిషి వెళ్ళిపోయినాడు. సింహరాజు తోట వెలుపలి కొచ్చి, అలిసి వుండటం మూలాన, ముందు కెళ్ళలేక అక్కడే పడి నిద్రపొయ్యాడు.

*　　　*　　　*

మెలకువ వచ్చేసరికి చంద్రుడు నెత్తిమీద వున్నాడు.

చల్లగాలికి శరీరం సేద తేరింది. అయినా నరాలు, కండలు, నొప్పులెత్తుతున్నాయి. ఉత్సాహమే ఆలంబనం చేసుకొని ముందు కెళ్ళాడు. 'దాపులోనే గ్రామం కనిపించింది. అతని సంతోషానికి మేరలేక పోయింది. తను ఎంతో కాలం నుండీ, కంటున్న కలలు, యీనాడు నిజం కాబోతున్నాయి. మానవ సమాజం మధ్యకు తను వెడుతున్నాడు. వారిని సహృదయంగా అర్థం చేసుకుంటాడు. ఆ అనుభవాన్ని తన రాజ్యంలో....

అయితే ఇవన్నీ తల్లక్రిందు లవడానికి ఎక్కువ కాలం పట్ట లేదు. అత నెంతో 'ఇది' గా నలుగు రైదుగురను పలకరించాడు. ఎవరో వెనుకనుండి తరుముతున్నట్లు వారు హడావుడిగా వెళ్ళిపోయారు గానీ, నిలిచి సమాధానం చెప్పలేదు. సింహరాజు ఏ మాత్రమో ఆశ్చర్యపడక పోలేదు. తనెంతో ఆప్యాయంగా పలకరిస్తే వారెందుకు పలకక్క పోవాలి? దీనికొక సమాధానం చెప్పుకొన్నాడు సింహరాజు. ఇంతకన్న ఆప్యాయంగా పలకరించే వారికోసం వెళ్ళి ఉండ గూడదా?

ఇంతకన్నా ఆశ్చర్యకరమైన విషయం, ఆ రాత్రి పడుకొ్కందుకు సింహరాజుకు చోటు దొరకలేదు. విశాలమైన భవంతు లున్నాయి, మేడ లున్నాయి, మిద్దె లున్నాయి. మరీ ఒకొ్కక్క కొంపలో, ఒకరిద్దరు మనుష్యులకంటే ఎక్కువ ఉన్నట్టు రూఢిలేదు. అటువంటివారు గూడా, తను పడుకొంటానంటే వీలు కాదన్నారు. ఎందరినో సింహరాజు అభ్య

ర్థించాడు. కానీ, ఆ రాత్రి అతనికి జానెడు చోటు దొరక లేదు. చివరికొక దయాహృదయుడు 'దేవాలయంలో పడుకో వచ్చు. అక్కడి కెళ్ళు' అని సలహా యిచ్చాడు. సింహరాజు అతురాలా ఆ సలహాను పాటించాడు. దేవాలయం దీపికలతో కళకళ లాడుతున్నది. అర్చకుడు సర్వాంతర్యామికి నీరాజన మిస్తున్నాడు. కొందరు దూరంగా నిలబడి, భగవద్దర్శనం కోసం తొక్కిస లాడుతున్నారు. ఇంకొందరు భగవత్సాన్ని ధ్యంలో ఉన్నారు. సింహరాజు రెండు వేపులా విడూరంగా చూశాడు. అతనికో సందేహం కలిగింది. వీ రెందుకు భగవ త్సాన్నిధ్యంలో ఉన్నారు? దూరంగా వా రెందుకుండ వలసి వచ్చింది? ప్రక్కనే ఉన్నాయన వద్ద, యీ సందేహం వెలి బుచ్చాడు సింహరాజు.

'మరీ అడవి జంతువులా మాట్లాడతా వేమిటయ్యా! ఛండాలురు దేవాలయంలోకి రాగూడదనిగూడా తెలీదా, ఇన్నేళ్ళొచ్చినా?'

సింహరాజు మాట్లాడ లేదు. ఛండాలురంటే ఏమిటని వివరమడిగాడు. తలతిరిగే సమాధానం పొందాడు.

'నిజానికి, అంటువంటి వారే, మరింత భగవత్సాన్ని ధ్యం లోకి రావలసి ఉంటుంది. ఆ అవసరంగూడా వారికే ఎక్కువ. ఏ అవసరమూ లేని, యీ తదితరులు దేవుణ్ని ఆరా ధించడంలో అర్థంలేదు. ఎందు కంటే—'

అతను వివరాలు చెప్పలేదు. చెప్పే ప్రయత్నంగూడా

చేయలేదు. ఆ సరికే ఓ పెద్దగుంపు అతన్ని చుట్టు ముట్టింది. వారందరినీ చూసి క్షణకాలం సింహరాజు ఆనంద పడ్డాడు. ఆ వెంటనే అతన్ని భయం కమ్ముకొన్నది. మరొక్క మాట - ఏ మాట అయినా సరే – మాట్లాడితే, తన ప్రాణాలు తనకు దక్క వనుకొన్నాడు సింహరాజు. ప్రజలందరూ తన్న టానికి అప్పుడే సంసిద్ధంగా ఉన్నారు. ఈ సంగతి సింహరాజు గ్రహించాడు. నోరు విప్పలేదు. అతని మనస్సులో ఎన్నో భావాలున్నాయి. వాటి నన్నింటినీ ప్రయోగించాలని రవంత ఉత్సహించాడు. అయితే పరిస్థితులు అనుకూలంగా లేవు. అందువల్ల తన ఉనికికే భంగ మేర్పడే టట్లున్నది. అదీ గాక, తనకీ ప్రజలతో ఇదే ప్రథమ సంబంధం. వీరి ఆచార వ్యవహారా లేమిటో తనకు తెలియవు. తను తెలుసు కొందుకు వచ్చాడు గానీ, తెలియ జెప్పేందుకు రాలేదు గదా!

కొంచెం ప్రొద్దుపోయింది. అప్పటి దాకా జనంతో బిలబిల లాడుతున్న దేవాలయం నిర్మానుష్య మయింది. ఒంట రిగా తను యిందులో యీ రాత్రి గడపా లన్నమాట! ఆ మాట తలపుకొచ్చే సరికి సింహరాజు కెందుకో భయం వేసింది. గుండెలు పీచుపీచు మన్నాయి.

నిజమేగానీ, ఇప్పుడు సింహరాజు చేయగలిగిందేమీ లేదు. తనకా ఊళ్ళో పండుకొందుకు చోటు లేదు; లేకపోవట మేమిటిగానీ, దొరక లేదు. రాత్రిళ్ళు పడుకోవలసిన అవసర మంటూ ఒకటి వుండె! అథవా లేక పోయినా, ఇలా

రాత్రులు ఇక్కడ తిరగడం ఉచితమో అనుచితమో తనకు తెలియదాయె! కాబట్టి ఈ రాత్రి ఎంత భయం వేస్తున్నా - ఈ దేవాలయంలో గడపక తప్పదు.

ఈ నిశ్చయాని కొచ్చిన తరువాత, సింహారాజు కున్న భయంలో సగభాగం తీరిపోయింది. ఓ మూలగా ఇంతచోటు బాగుచేసుకొని కటిక రాళ్ళమీద నడుం వాల్చాడు. నిజాని కతనికి వెంటనే నిద్ర పట్టవలసింది. ఎన్నడూ చెయ్యని శరీర కష్టం చెయ్యవలసి రావడంవల్ల, శరీరం యావత్తూ పోట్లు పెడుతున్నది. విశ్రాంతిని కోరుతున్నది. అయినా నిద్ర పట్ట లేదు. చిత్ర విచిత్రమైన ఆలోచన లొచ్చి, మనస్సు మధన పడి పోతున్నది. కళ్ళు మూసుకొని, అలానే పడుకొన్నాడు.

ఒకటి రెండు నిమిషాల కల్లా అతని దాపులో ఏదో చప్పుడయింది. సింహారాజు తలెత్తి చూశాడు. ఒక మనిషి దేవాలయపు దీపం ముందు కూచుని, ఏదో సర్దుకొంటు న్నాడు. ఉత్సాహం కొద్దీ సింహారాజు సమీపించి, మరింత పరిశీలనగా చూశాడు. అవతలి మనిషి కాలికున్న కట్లు విప్పాడు. చంక కింద వున్నకర్ర దూరంగా పెట్టాడు. ఎడమ కంటినుండి ఏదో పీకి జాగ్రత్త చేస్తున్నాడు.

సింహారాజు ఈ చర్య లన్నింటినీ జాగ్రత్తగా గమ నించాడు. అతని కేమీ తెలియలేదు. కానీ తెలుసుకోవాలన్న ఇచ్ఛ అతన్ని ప్రబలంగా వేధించ సాగింది. మెల్లిగా విషయ మేమిటని అడిగాడు.

'మీకు తెలవం దేముంది బాబయ్యా! ఏదో బతుకు దెరువు.'

'అంటే ?' అన్నాడు సింహరాజు ఆశ్చర్యంగా.

అవతలి వ్యక్తి, ఒక్క క్షణం అతన్ని ఎగాదిగా చూసి, మంచి వాడేనన్న నమ్మకం కుదిరిన తర్వాత, తన వ్యాపార రహస్యం కాస్తా బయట పెట్టాడు.

'బాబుగారూ! ఇన్ని యాసాలేత్తే గానీ ఈ మాయ పొట్ట నిండదండీ! అప్పటికీ పోసిచ్చలేక - ఆలీ బిడ్డల్ని తరిమేశానండీ—' అని ఒక్క క్షణం ఆగిపోయాడు.

సింహరాజు మరి కాస్త దగ్గరికి జరిగాడు.

'ఈ యాసం యేత్తేగానీ, పొట్ట నిండదండీ! నిజంగా నా కాలికి జబ్బూ లేదు, నేను గుడ్డోణ్ణి కాదు.' అన్నాడతను.

'మామూలుగా వెళ్ళి అడగ్గూడదూ? అసలు ఇంకోరిని అడగడ మెందుకూ? తిండికోసం అన్ని బదవలు పడుతున్నావంటే నాకు చిత్రంగా ఉంది' అన్నాడు సింహ రాజు. 'నేనిలా వస్తున్నప్పుడు చాలా పంట పొలాలను చూశాను. ఎన్నో ధాన్యపు రాశులను చూశాను. ఇంత పుష్కలంగా ఆహారం ఉండి గూడా, దాని కోసం నువ్వేవేవో వేషా లేస్తున్నానంటుంటే, నాకు నమ్మశక్యం గాకుండా ఉంది.'

'బాబుగారూ! మీరే సిత్తరంగా అంటుండారు. కలిగిన పెబువులకుంటే, మాలాటోళ్ళి కెట్టా వచ్చుద్దండీ అయ్యా?'

అన్నాడా మనిషి.

'పోయి తెచ్చుకొంటే!' అన్నాడు సింహరాజు.

'ఇరగదంతారు సామీ! మీరేదో ఎగతాలిగా అంటుం డారు గానీ, తమకి తెలియదా దొరా!'

ఇందులో ఏదో కిటుకున్నదనీ, అదింత వరకూ తనకు తెలియదనీ సింహరాజు అనుకున్నాడు. ఇప్పుడు తనేమి మాట్లాడినా అభాసు పాలుగాక తప్పదు. మానవలోకపు కట్టుబాట్లేమిటో, స్థితిగతు లేమిటో తనకు తెలీదు. ఏమంటే ఏమవుతుంతో తను చెప్పలేడు.

'పనికోసం నానా యాతనా పడ్డానండి. యాడా దొరక లేదండి! అన్నీ సజావుగా ఉండి అడుక్కొంటే ఎవ్వరూ పెట్టరండి! అందుకని ఈ యాసం యేసుకొన్నా నండీ!' అన్నా డతను.

సింహరాజుకు కొంచెం అర్థమయింది. ఈ లోకంలో నిజానికి తావు లేదని తనిప్పుడు తెలుసుకొన్నాడు. అతని బుర్ర జిగేల్ మంది. ఎవరో మెదడంతా కల్లోల పరుస్తున్నట్లు గిజగిజ లాడాడు. ఆ సంఘర్షణకు తట్టుకోలేక చప్పగా నిద్ర పోయాడు.

## 4

ఇంకా తెల్లవార లేదు. అప్పటికే చాలా మంది స్త్రీలు, తడి గుడ్డలతో దేవాలయం చుట్టూ తిరుగు తున్నారు. ఒక లావుపాటి మనిషి, చిన్న గోచీ పెట్టుకొని, ఒక మూల

చతికిలబడి గగ్గోలుగా భజన చేస్తున్నాడు. దేవాలయం గంటలు, ఉండి ఉండి మోగుతున్నాయి.

సింహరాజుకు మెలకువ వచ్చింది. కాని లేవ లేదు. లేవ లేక పోయాడు. వళ్ళంతా నొప్పు లెత్తుతోంది. తలలో నాదుగా వుంది. గతంలో తనకు జరిగిన అనుభవాలు, ఉప్పెనగా అతనిలో రేగాయి. కడుపులో భగ్గున మంటలు లేస్తున్నాయి. ముందు ఎక్కడైనా యింత తిండి సంపాదించాలి. లేకపోతే శోష వచ్చేలాగా వుంది. ఇదే - తన అరణ్యంలో అయినట్టయితే — అస లప్పుడు తనకు ఆకలంటే ఏమో తెలియదు; తెలియ వలసిన అవసరమూ లేదు.

—ఓ మూల పెద్ద గోలగా వినబడింది. 'పట్టుకోండి - పట్టుకోండి - దొంగ దొంగ' అన్న కేకలు గందరగోళంగా వినిపించాయి. ఒక బలిష్ఠుడైన మనిషి, ఆ మసక చీకట్లో, ఇటు వేపే దూసుకొస్తున్నాడు. అతని చేతిలో ఏదో చిన్న మూట లాంటిది ఉన్నది. ఆ మనిషి ఇటు అటు చూశాడు. ఒక్క క్షణం నిలబడాడు. మూటనక్కడ వదిలేసి, ఛెంగున గోడ దూకి మాయమై పోయాడు.

సింహరాజు కిదంతా అగమ్య గోచరంగా వుంది. ఆ గోల ఎందుకు జరిగిందో, ఆ మూలనుండే, యీ మానవు డెందు కీ దిక్కుకు పరుగెత్తు కొచ్చాడో - వచ్చిన వాడు నిల బడక, ఆ మూట నిక్కడ పారేసి ఎందుకు పారిపోవలసి వచ్చిందో అవగాహన కాలేదు. దూరంనుండి మనుషులు

గుంపులు గుంపులుగా వస్తున్నారు. ఆ రావడం యీ మూట కోసమేనేమో ననుకొన్నాడు. కింద పడివున్న దాన్ని చేత పుచ్చుకొన్నాడు. రెండడుగులు వేశాడో లేదో, జనం అతనిని చుట్టు ముట్టారు.

'లండి కొడకా! ఎక్కడకు పోతావురా నువ్వు?'

'తన్నండిరా తొత్తుకొడుకుని!'

'చూస్తారేమర్రా, మీ అసాధ్యం కూలిపోను.'

గుంపులు సింహరాజును మరింత సమీపించాయి. సింహరాజు ఆశ్చర్య పోయాడు. ఎందుకు వీరంతా తన నిలా చుట్టు ముట్టారు? తనేం చేశాడు? అలా మిర్రి మిర్రి చూస్తారెందుకు? చేతిలో ఆ ఆయుధా లెందుకు?

ఎందుకో మరు క్షణంలోనే అతనికి తెలిసి పోయింది. మొదటి దెబ్బకే సింహరాజు 'అమ్మో' అని గావుకేక పెట్టి కూలిపొయ్యాడు. దెబ్బనుండి తేరుకొనే లోగానే మరో దెబ్బ, మరో దెబ్బ, మరోటి, మరోటి - సింహరాజు వివశుడై నాడు. కొన్ని క్షణాల వరకూ మాత్రమే అతనికి స్పృహ ఉంది.

తిరిగి అతను కళ్ళు తెరిచి చూసే సరికి, ఓ ఇంట్లో వున్నాడు. ప్రత్యేకమైన దుస్తులు వేసుకొన్న కొంత మంది మనుషులు, అటూ యిటూ హడావిడిగా తిరుగు తున్నారు. చేతులు విదిలించుకో బోయాడు. ఇనుప సంకెళ్ళు గలగల మన్నాయి.

'ఏయ్! నీ దేవూరు?' అన్నాడు కుర్చీలో కూర్చున్న

మనిషి.

ఆ అడుగుతున్న దెవరినో సింహరాజుకు తెలియ లేదు.

'నిన్నేరా భోసడికె! పిలుస్తుంటే అటు చూస్తావేంరా? అరే ఫోర్ ఫైవ్, కాస్త వీడికి మెలుకువ తెప్పించు.'

నల్లగా, సన్నగా ఉన్న ఒకాయన - చేతిలో లాఠీ వూపుకొంటూ దగ్గరకొచ్చి, డొక్కలో ఒక్క పోటు పొడిచాడు. ఆ పోటుతో సింహరాజు ప్రాణాలు గిలగిలలాడాయి.

'దొరగా రడుగుతుంటే చెప్పావేంరా? ఇడియట్!... ఊం చెప్పు. నీ దేవూరు?'

'అరణ్యం' అనేశాడు సింహరాజు.

కుర్చీలో కూర్చున్న మానవాకారం ఘొల్లుమని నవ్వింది.

'అరే ఫోర్ ఫైవ్! పాత సరుకేరా! మాటల్తో లాభం లేదు. కాస్త మందు - జాస్తీగా తగిలించు.'

సింహరాజు వెన్ను ఫెళక్కుమని విరిగింది. భుజాలు జివ్వు జివ్వు మని మంటలెత్తాయి. పిరుదులు అగ్ని గోళాలయినాయి. మొదటి దెబ్బకే సింహరాజు గోల కెత్తాడు. కుర్చీలో కూచున్న ఆకారం దగ్గరి కొచ్చి, ముఖం మంట లెత్తేలా గుద్దింది. కళ్ళు చీకట్లు కమ్మాయి. చెమటతో వళ్ళంతా తడిసి ముద్దలాగయింది. కింది పెదవి బద్దలయి, రక్తం మెల్లగా కారుతోంది.

'చెప్పు లండికొడకా! నీదేవూరు? ఇక్కడి కెప్పు డొచ్చావు? ఎందుకొచ్చావు? నీ పేరేమిటి? ఇదివరకు ఎక్కడెక్కడ దొంగతనాలు చేశావ్? ఆ సొమ్మంతా ఎక్కడ దాచావ్? ఊఁ చెప్పు...'

లాఠీ గాలిలో ఆడింది. సింహరాజును భయం ఆవేశించింది. మాట్లాడడానికి ప్రయత్నించాడు. దవడలు కదిలి కదప నివ్వడం లేదు. పెదాలు పోశెత్తు తున్నాయి. ఒక లాఠీ రెండుగా, నాలుగ్గా, పదిగా, వేయిగా, గాలిలో ఆడుతున్నట్లు కనిపించింది. కళ్ళు మూసుకొని, కూల పడ్డాడు.

'మొండి వెధవ! ఇన్ని తన్నినా నిజం చెప్పలేదు... అరేయ్ ఫోర్ ఫైవ్, వీణ్ణి గదిలో తొయ్యండి. ఆనక చూద్దాం.'

ఫోర్ ఫైవ్ సింహరాజు చేయి పట్టుకొని, గదిలోకి ఈడ్చి, ఇనప తలుపుకు తాళం పెట్టాడు.

* * *

సింహరాజు కళ్ళు తెరిచాడు. చుట్టూ చీకటిగా ఉంది. నేలంతా చెమ్మగా, మాగుడు వాసన కొడుతూ ఉంది. మెల్లగా లేచి కూచున్నాడు. నరాలు కిటకిట మన్నాయి. శరీరమంతా నజ్జు నజ్జయినట్టు బాధతోనిండి పోయింది. మసగ వెలుతుర్లో, తనొక చిన్నసైజు గదిలో ఉంచబడినట్టు తెలుసుకొన్నాడు. ఆ గదికి ఇనప చువ్వల తలుపు ఉంది. సింహరాజు చువ్వలగుండా బైటికి చూశాడు. ఇందాకటాయనే, కూచుని

ఏదో రాసుకొంటున్నాడు. మధ్య మధ్య తనవేపు కళ్లు చికిలించి చూస్తున్నాడు. చుట్టూ ఎవరికోసమో వెదుకుతున్నాడు.

సింహరాజుకు వుదయపు సంగతులు జ్ఞప్తి కొచ్చాయి. భయంతో శరీరం కంపించింది. చప్పున వెనక్కు వచ్చి, చీకటి మూలగా కూచున్నాడు. అతనికి చాలా విచార మేసింది. హాయిగా ఆ అరణ్యంలో పడుండక, తనీ పాడు పనికి ఎందుకు పూనుకొన్నాడు? ఎందు కిన్ని అవస్థలు కొని తెచ్చుకొన్నాడు?

చిన్న చప్పుడు చేసుకొంటూ తలుపు తెరుచుకుని, మళ్ళీ మూసుకొంది. కుర్చీలో కూచున్నాయన వచ్చాడని, అంత చీకట్లోనూ సింహరాజు గుర్తించాడు.

'ఏయ్! ఇలా రా!'

సింహరాజు గడగడ లాడుతూ అతని దగ్గర కొచ్చాడు.

'నువ్వు నిజం చెప్పు. నిన్ను విడిచి పెడతాను... ఇందాక అలా కొట్టి నందుకు నాకే చాలా కష్ట మేసింది... నువ్వు అందరిలాంటి వాడివి కాదని, నే నప్పుడే అనుకొన్నా. మామూలు దొంగవే అయితే, ఆ కోట లాంటి ఇంట్లోకే వెళ్ళ లేవు... అది సరేగానీ, నీకు బైటి కెళ్ళాలని లేదూ?'

'ఉంది' అన్నాడు సింహరాజు.

'భేష్! మంచి వాడివి. నిన్నలాగే విడిచి పెడతాను. మరి నేను చెప్పినట్లు చేస్తావా?'

'చేస్తానండి !'

ఆ మనిషి ఓ క్షణం ఏమీ మాట్లాడ లేదు.

'ఏంచేయ మంటారండీ?' అన్నాడు సింహారాజు, ఏదో ఒకటి చేసి త్వరగా బయట పడదా మని.

'నిన్ను విడిచి పెడతాను ... నీ కొచ్చిన భయమేమీ లేదు ... చుట్టూ మా వాళ్ళే కాపలా ఉంటున్నారు. నిన్నా ఇంట్లో దించుతాం ... లోపలికెళ్ళి ఉన్న నగలూ, డబ్బు, బీరువాలో ఉంటాయి .... లంకించురా...నీకు ... ఏదో ఉంటుంది... నిన్నూ విడిచి పెడతాను!'

సింహారాజు కొయ్యబారి పోయాడు. ఏమిటీ విచిత్రం? తను చెయ్యని తప్పుకు శిక్షింప బడుతున్నాడు. ఈ శిక్ష నుండి తప్పుకోవాలంటే, మరో తప్పు బుద్ధి పూర్వకంగా చేయవలసి వస్తోంది. ఇంతకంటే మరో మార్గ మేమీ లేదా? ఈ పని చేయకపోతే, తన కిక్కడ నుండి విముక్తి ఉండదన్న మాట. ఉండక పోవచ్చు. కానీ, తనాపని చెయ్యలేడు. ఆ మాటే అతనితో చెప్పాడు సింహారాజు.

'నీ ఖర్మ! దానికి నేను చేయగలిగిం దేమీ లేదు.' అన్నాడా మనిషి కొన్ని క్షణాలు ఊరుకొని. 'పోనీ—ఇంకో చిన్న సూత్రం ఉంది, చేస్తావా?'

ఈ దఫా సింహారా జేమీ మాట్లాడ లేదు.

'మీ వాళ్ళకు కబురు చేసి, కాస్తో కూస్తో తెప్పించుకో, డబ్బులు ముట్టంగానే నిన్ను వదిలేస్తాం. మీ వాళ్ళెక్క

డున్నారో చెప్పు. నేనే కబురు చేస్తాను.'

అయ్యో! అక్కడికి మీరెవరూ వెళ్ళలేరు. వెళ్ళి బ్రతికి రాలేరు గూడాను. నా పరివారం నా కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. నేను లేకుండా మీరు వెడితే మిమ్మల్ని చంపడం ఖాయం. ఎందుకు వృధాగా ప్రాణాలు వదులు కొంటారు! నిజంగా, నాకేమీ తెలియదు. మీ కిష్టముంటే, వదలండి. లేదా ఉంచండి' అన్నాడు సింహరాజు.

ఒక్క క్షణం నిశ్శబ్దం జీరాడింది.

'నీ పేరేమిటి ?'

'అయ్యా! ఇప్పటికి చాలా సార్లు మీకు చెప్పాను, నా పేరు సింహరాజు.'

'హుఁ' అని ఒక్క మూలుగు మూలిగి 'నీది అరణ్యవాసమే కదూ ?' అన్నాడు అతను.

'ఔనండి !'

'నువ్వా అరణ్యానికి రాజువు గదూ ?'

'చిత్తం !'

దీర్ఘంగా ఒక్కసారి నిట్టూర్చి 'పిచ్చివాడు' అనుకుంటూ వెళ్ళిపోయాడతను.

సింహరాజు అతను వెళ్ళినవేపే, ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డాడు.

'భాయీ !'

సింహరాజు వులిక్కి పడ్డాడు.

'నేనూ నీ పక్క గదిలో నుంచి మాట్లాడుతున్నాను. నీకు కనుపించదు...మొత్తానికి భలే నాటక మాడావయ్యా. ఉద్దండ పిండానివి. అది సరే గానీ, ఏమాత్రం గిట్టుబాటయిం దేమి ?...వాడెళ్ళి పోయాళ్ళే! తెల్లారాక గానీ రాడు. నాతో నన్నా నిజం చెప్పు.'

'నాకర్థం కావటం లేదు. గిట్టుబాటు కావడ మేమిటి ?' అన్నాడు సింహరాజు.

అవతల నుంచి నవ్వు వినిపించింది.

'ఓస్సోసి—నా దగ్గరా నీ నాటకం! నే నసలే ఖూనీ కోరును—'

'ఖూనీయా ? అంటే ?' అన్నాడు సింహరాజు అమాయికంగా.

అవతల ఖైదీకి, నిజంగా ఇతను పిచ్చి వాడేనేమో నని పించింది. కాస్సేపు కాలక్షేపమన్నా అవుతుందని, గ్రంథం పెంచాడు.

'ఖూనీ అంటే—బ్రతికున్న వాళ్ళను చంపటమన్న మాట !'

'ఎందుకు చంపడం ? అలా చంపి వాళ్ళను తింటారా ?'

'ఓరి నీ కడుపుడక ! మొత్తానికి కాలాంతకుడి వేనే !'

కాస్సేపు నిశ్శబ్దం తరవాత అవతలి ఖైదీ మళ్ళీ ప్రారంభించాడు.

'మనుషుల్ని తినరుగానీ, తిన్నంత పనీ చేస్తారు.'

'మీ కెందుకు చంపవలసి వచ్చిందో చెబుతారా ?'

ఆ ఖైదీ కాండ్రించి ఊశాడు.

'అసలీ ఆడజాతంటేనే నాకు మహామంట. అందులో నా పెళ్ళామంటే నాకు మరీ అసహ్యం. అయినా, అలాగే దానితో రోజులు నెట్టుకొంటూ వస్తున్నాను—'

సింహారాజు ఏదో అనబోయి చప్పున మానేశాడు.

'ఇన్నిటికి ఆ కాలం అట్లాంటిదీ. దాన్ని నేను గదిలోకి రమ్మన్నాను. తలనొప్పిగా ఉన్నదనీ, రాననీ అన్నది. ఎన్నో విధాల చెప్పి చూశాను. బ్రతిమి లాడాను. మంచి మంచి చీరెలు కొనిపెడతానన్నాను. ససేమిరా రానన్నది. కోపం పట్టలేక పోయాను. పక్కనే ఉన్న కత్తిపీట విసిరేశాను. ఖస్సున గొంతు సగందాకా తెగింది. నెత్తురు చిమ్మింది. నేను పారిపోనన్నా పొయ్యాను గాదు. అలాగే గుడ్లు మిటకరిస్తూ, ఉండి పొయ్యాను. పోలీసులొచ్చి పట్టుకున్నారు.'

ఈ చివరి మాట లంటున్నప్పుడు, ఆ ఖైదీ గొంతు బొంగురు పోయింది. సింహారాజుకు కడుపులో దేవినట్లుగా ఉంది. మానవులింత నీచులని, అతనెన్నడూ ఊహించలేదు. హాయిగా, స్వేచ్ఛగా, పరస్పరాంగీకారంతో, జరగవలసిన దాంపత్య ధర్మం – ఇలా బలవంతంగా, జరపబడడం, ఒక్క మానవులకే చెల్లుబాటయింది. ఇష్టా యిష్టాలతో గానీ సమయాలతో గాని, వీరికి పని లేదనిపిస్తూంది. ఏదో విధంగా ఆ కక్కుర్తి తీర్చుకోవడమే ముఖ్యం లాగుంది. కానీ, ఏ మాన

వేతర ప్రాణుల్లోనూ ఈ విధానం గోచరించదు. ముఖ్యంగా తన జాతిలో ఇది బొత్తిగా చెల్లదు. ఈ ప్రాథమిక సూత్రమే తెలియని ఈ మనుషులు తన కంటె ఎందులో గొప్ప?

'అయినా ఫర్వాలేదు లే భాయీ!' అని ఖైదీ కంఠం ధ్వనించింది. 'నేను బాగా ఉన్న వాణ్ని. వేలకు వేలు ఖర్చు పెట్టయినా బైటతడతాను. కానీ నువ్వేలాగా—అని ?'

'అయితే నిన్ను శిక్షించరా ఏమిటి?' అన్నాడు సింహారాజు.

'నన్నా? శిక్షించడమా? అదేమీ లేదు. ఇప్పటికే కట్టుకో వలసిన వాళ్ళందర్ని కట్టుకున్నాం. పెద్ద పెద్ద లాయర్లను నలుగుర్ని మాట్లాడాం.'

'అయితే మాత్రం—?'

'నేను నిర్దోషినని చెప్పడానికి యాభై మంది సాక్షులు సిద్ధంగా ఉన్నారు. ఒక్కొక్కరికి ఐదేసి వందలిస్తున్నాం. ఖర్చులన్నీ మావే!' అన్నాడు ఖైదీ.

'ఈ డబ్బు తీసుకొని - నువ్వేమీ నేరం చెయ్యలేదని వాళ్ళు చెబుతారన్న మాట. అవునా?' అన్నాడు సింహారాజు.

'ఆహా! లేకపోతే నలుగురు లాయర్లెందుకూ అఘోరించను!'

'నీ భార్య మరణానికి కారణ మేమని చెబుతావ్?' అన్నాడు సింహారాజు.

'ఓస్. ఆ పని ఎప్పుడో పూర్తయి పోయింది. ఆవిడకు నాలుగేళ్ళ నుండీ, కడుపులో నొప్పి. ఎన్ని మందులు తిన్నా తగ్గలేదు. చివరకు ఆ బాధను భరించలేక ఆత్మహత్య చేసుకొంది. ఆవిడ మందు తిన్న పది మంది డాక్టర్ల దగ్గర్నుంచి మేము స్టేటుమెంట్లు తెచ్చి సిద్ధంగా ఉంచాం.'

'పాపం! నిజంగా ఆవిడకు జబ్బా ఏమిటి?'

ఖైదీ ఫక్కుమని నవ్వాడు.

'నిజంగా నువ్వు పిచ్చాడివేరా భాయీ! జబ్బేమిటి నీ పిండాకూడు! ఇదంతా మేమే కల్పించాం. వందేసి రూపాయల కాగితాలు పుచ్చుకొని, డాక్టర్లు ఈ సర్టిఫికెట్లు ఇచ్చారు. ఈ ఉపాయం చెప్పింది గూడా మా న్యాయవాదులే! అదీ గాక - జడ్జీగారు, మా నాన్నకు కాస్త తెలిసినాయన. నిన్ననే వెళ్ళి మాట్లాడొచ్చారు. కేసు నాలుగు సార్లు వాయిదా వేసి కొట్టేస్తానన్నాడట-'

ఖైదీ ఇంకా ఏదో చెబుతూనే ఉన్నాడు. కానీ, సింహరాజు వినలేక పోయాడు. అప్పటికే అతనికి సాలొచ్చింది. మెదడంతా తుకతుక లాడుతోంది. తల పగిలి పోతుందేమోననిపించింది. రెండు చేతులతోనూ తల గట్టిగా పట్టుకొని, కుప్పగా కూలబడ్డాడు.

## 5

సింహరాజు జైలునుంచి విడుదలైనాడు. విడుదలయినా నన్న సంతోషం అతనికే కోశానా లేకుండా పోయింది.

జైల్లో వున్నంత కాలమూ, రకరకాల వ్యక్తులతో అతను పరిచయం చేసుకొన్నాడు. వారి అనుపాను లన్నీ తెలుసుకొన్నాడు. అతని గుండె తెకతెక లాడిపోయింది. ఎందరో మహా హంతకులు, గజ దొంగలు, త్రాగుబోతులు, లుచ్చాలు, జూదర్లు, రాజకీయ వేత్తలు, దేశ భక్తులు, విప్లవ వాదులు, నిరపరాధులు, అమాయికులు, సజ్జనులు, ఆ జైల్లో ఉన్నారు. ఎవరి గొడవ వారిదీ, ఎవరి ఘోష వారిదీ!

కొందరు ఆత్మ కథలు వింటుంటే, సింహరాజు హృదయం ద్రవించి పోయింది. వలవలా ఏడ్చాడు. మానవులింత అధోగతిలో ఎందుకున్నారో, ఎట్లా వున్నారో, అతనికి తోచ లేదు. ఇంత అన్యాయాన్నీ, అక్రమాన్నీ, అధర్మాన్నీ, పైశాచికత్వాన్నీ, ఎలా భరిస్తున్నారా – అని, సింహరాజు ఆశ్చర్య పోయాడు.

జైలునుంచి విడుదలయిన తరువాత సింహరాజు, బుర్ర కొన్ని క్షణాలు డొల్లగా అయిపోయింది. తనిప్పు డేమి చెయ్యాలి ? ఎక్కడకు వెళ్ళాలి ?...వీటన్నిటికన్నా ముందు, తనకు ఆకలి మండిపోతున్నది. జైల్లో వున్నప్పుడు - తిండి సమస్య అతన్నంతగా బాధించ లేదు. ఏదో ఓ తుక్కు...వేళ కింత పడేస్తుండేవారు. రోజులు వెళ్ళ మారిపోతుండేవి. కానీ యిప్పు డలా కాదు. తన తిండి తనే వెదుకోక్కవాలి. ఎక్కడ వెదుక్కోనేట్టు ?

దురదృష్టవశాత్తూ అప్పుడు దేశాన్నంతా కరువు ఆవ

రించింది. తిండిలేక ప్రజలు అల్లాడి పోతున్నారు. గ్రామా లకు గ్రామాలు పాడుబడి బీడువారాయి. లక్షలాది గ్రామీ ణులు తట్టా బుట్టా నెత్తి నెట్టుకొని, పట్టణాల కేసి నడుస్తు న్నారు. బాటలన్నీ క్షామ పీడితుల పదఘట్టనలతో, నలిగి పోతున్నాయి. వృద్ధులు, పసి పాపలు, నవసి నవసి ఎండి పోయి, పండుటాకుల్లా రాలిపోతున్నారు.

ఉన్న కొంపా గోడీ, పొలమూ పుట్రా, అమ్ముకొని తిన్నవారు తిన్నారు. చెట్ల ఆకులు, రెమ్మలు, బెరళ్ళు, ఒలుచు కొని, ఇంకొంత కాలం బ్రతికారు. కను చూపు దూరంలో, పచ్చని చెట్టన్న మాటే లేకుండా పోయింది. భార్యా భర్తలు, తల్లి బిడ్డలు, సోదరీ సోదరులు - ఆగమ్మ కాకులై, చెట్టు కొకరు, పుట్ట కొకరుగా చెదిరి పోయారు. ఆకలికి తాళలేక, కనిపించిన ప్రతి చెత్తనూ తినడంతో, రోగాలు ప్రారంభిం చాయి. మహామారి స్వైర విహారం చేసింది. తన సహస్రకోటి బాహువులను సాచి ఆలింగనం చేసుకొంటోంది. ఆ వికృతా లింగనంలో, లక్షలాది ప్రజలు, నలిగి, వత్తలై, తుత్తునియలై, నాశన మవుతున్నారు. వారిని ఆదరించే వారుగానీ, కనీసం వారి విషయం ఆలోచించే వారుగానీ, కరువయ్యారు.

ఇంతటి క్షామంలోనూ, సౌఖ్యానందా లనుభవిస్తున్న వారు లేక పోలేదు. వారీ కరువును చక్కగా ఉపయోగించు కొన్నారు. కొందరు వ్యభిచార గృహాలను ప్రారంభించారు. దిక్కూ మొక్కూ లేక అల్లాడి పోతున్న యువతు లెందరో,

ఈ గృహాల్లో చేరారు. పట్టెడు మెతుకుల కోసం తమ శీల సంపత్తిని బలి పెట్టారు. ఎందరో తలి దండ్రులు తమ బిడ్డలనీ గృహాలను అమ్ముకొన్నారు. ఎందరో భర్తలు, తమ భార్య లను ఇక్కడ దిగ విడిచారు.

రోదనలు, తిట్లు, తన్నులు, రోగాలు, దరిద్రం, హాహా కారాలు - ఓహ్, ఆకాశం దద్దరిల్లి పోతున్నది.

సింహరాజుకు పిచ్చెత్తినట్లయింది. ఒక్కసారి ఈ లోకా న్నంతా భస్మం చేద్దామన్నంత కోపం వచ్చింది. ఆవేశంతో జ్వర పీడితునిలా కంపించి పోయాడు. అలాగే, అన్ని చోట్లా పర్యటించాడు.

అతని కెన్నో సంగతులు తెలిసి వచ్చాయి. అన్ని సంవ త్సరాల కంటే యీ సంవత్సరం పంటలు చాలా అధికంగా పండాయి. కానీ భయంకరమైన క్షామం - దేశాన్ని కబళించి వేస్తున్నది. కారణం - ధాన్యం లేక కాదు. ధన దాహ పీడితు లైన కొందరు వ్యక్తులు అధిక ధరలకు దేశంలో వున్న ధాన్యాన్నంతా కొని నిలవ చేశారు. పండిన పంటంతా కొద్ది మంది వ్యక్తుల అధీనంలో వుండి పోయింది. సామాన్య ప్రజలు— కొందామంటే డబ్బు లేదు; అధవా డబ్బున్నా, ధాన్యం లేదు; ధాన్యమున్నా ధరలు చుక్కల కంటుతున్నాయి.

ఇలాంటి ఆపత్సమయంలో, పాలకులు - ప్రజలను ఆదు కొని వుండవలసింది. దురదృష్టవశాత్తూ, ప్రభుత్వం యీ తిండి దొంగల చేతుల్లోనే ఉంది; లేదా - వీరి బంటుల చేతుల్లో వుంది.

ఒక వైపు ప్రజలు — తిండి గింజలు లేక నల్లులు మాడి నట్లు మాడిపోతుంటే, వేలాది బస్తాల ధాన్యం, ఎండ, గాలి లేక, కొట్లల్లోనూ, నేల మాళిగల్లోనూ మురిగి పోవడం సింహ రాజు చూశాడు. దొంగ వ్యాపారం విచ్చల విడిగా, స్వేచ్ఛగా జరగడం చూశాడు.

అడిగే దిక్కు లేదు. అడిగినా సమాధానం చెప్పే దిక్కు అంత కన్నా లేదు.

*　　　*　　　*

ఉన్నట్టుండి దేశమంతటా పెద్ద సంచలనం ప్రారంభ మయింది. అన్ని చోట్లా యుద్ధ ప్రమాదపు హెచ్చరికలు చెయ్యబడాయి. విమానాలు, ఆకాశాన్ని దద్దరిల్ల జేస్తూ ఎగురుతున్నాయి. మిలిటరీ ట్రక్కులు, మర ఫిరంగులు, టాంకులు, గణగణ లాడుతూ పరుగులు తీస్తున్నాయి. 'ముష్కరులను ఎదిరించండి! మీ దేశాన్ని కాపాడుకోండి' అన్న వ్రాతలు, అన్ని చోట్లా ఆకర్షణీయంగా కనబడు తున్నాయి.

'అసలీ యుద్ధం ఎందుకొచ్చింది? ఎవరు ఎవరితో యుద్ధం చేస్తున్నారు?' అని ప్రశ్నించాడు సింహరాజు.

'ఇది—గనులు, ముడి సరుకులు, మార్కెట్ల కోసం వచ్చింది.' అన్నాడొకాయన భయ భయంగా అటూ ఇటూ చూస్తూ.

ఈ మాట చెప్పడానికి, ఆయన ఎందుకు భయపడు

తున్నదీ సింహరాజుకు అర్థం గాలేదు. చాటుకు పిలిచి వివరంగా చెప్పమన్నాడు.

'అయ్యా! మీరు చిత్రంగా అడుగు తున్నారు. కాస్త ఆలోచిస్తే ఎవరికైనా ఈ సంగతి తెలుస్తుంది...మీరు ప్రభుత్వపు మనుషులు కాదు గదా?' అన్నాడతను సింహరాజుకేసి అనుమానంగా చూస్తూ.

'కాదు.'

అతను నిట్టూర్పు విడిచాడు.

'పైకి ఇదెంతో గొడవగా కనిపించినా, నిజానికటువంటి దేమీ లేదు. మన దేశంలో - మీదీ దేశమే ననుకొంటున్నాను - పరిశ్రమలు విపరీతంగా పెరిగాయి. కొత్త పద్ధతి మీద తయారు చెయ్యబడిన యంత్రాలు అన్ని చోట్లా వెలిశాయి. పేరుకు చాలా మంది పారిశ్రామిక వేత్తలున్నా, దేశంలోని అన్ని ముఖ్య పరిశ్రమలు, ఏ నలుగురైదుగురి చేతుల్లోనో ఉన్నాయి. ఈ పరిశ్రమలు బాగా లాభించాలంటే, ముడి సరుకులు చౌకగా లభించాలి. చౌక రేటుకు కూలీలు దొరకాలి. ముడి సరుకులు వలస దేశాలనుండి, కారుచౌకకు దిగుమతి చేసుకోవటం జరిగింది. నిరుద్యోగంతో బాధ పడుతున్న కూలీలు - కొద్ది కూలీకే ఇక్కడే దొరికారు. సరుకులు, అవసరాన్ని మించి, తయారయ్యాయి. దేశీయులకు కొనే డబ్బు లేదు; ఎందుకంటే ప్రజల దగ్గరున్న డబ్బును, పన్నుల రూపంలో, ప్రభుత్వమే రాబట్టు కొంటూంది గనుక!

ఈ సరుకు విడుదల కానిదే లాభాలు రావు. విడుదల కావా లంటే మార్కెట్టు కావాలి. మళ్ళీ వలస దేశాల అవసరం వచ్చింది.

'వలస దేశాలు, తమ కున్న ముడిసరుకంతా, ఇతర దేశాలకు ఎగుమతి చేయడంతో, అక్కడ పెద్ద పరిశ్రమలంటూ అట్టే ఉండవు. సరుకులూ ఉండవు. ఇక్కడ తాళ ప్రమా ణంగా తయారైన సరుకులు, వలస దేశాల కెడతాయి. అక్కడి డబ్బును రాబట్టుతాయి.'

'అవుననుకోండి. ఇందువల్ల యుద్ధం రావలసిన అవసర మేమీ లేదే!' అన్నాడు సింహరాజు.

'వస్తున్నాను' అంటూ మళ్ళా ప్రారంభించా డతను. 'ఇలాంటి తతంగం, నాలుగైదు దేశాలే చేస్తున్నాయి. వీట న్నింటికీ, ముడి సరుకులూ కావాలి, మార్కెట్లూ కావాలి. ఎక్కణ్నించి వస్తాయి గనక? అందుకనే, ఈ దేశాలు, ఒక దానితో మరొకటి, ముడిసరుకు కోసమూ, మార్కెట్టు కోసమూ యుద్ధాలు చేస్తాయి.'

'ప్రస్తుతం మనకు - అంటే ఈ దేశంలో ఉన్న కోటీ శ్వరులకు - ఇతర దేశాల్లో ఉన్న కోటీశ్వరులకూ, యుద్ధం వచ్చింది.'

'బావుంది. అయితే, వాళ్ళూ వీళ్ళూ కొట్టుకు చస్తే పోతుంది గదా, దేశంనిండా ఇంత అలజడి రేపటం దేనికి?' అన్నాడు సింహరాజు.

ఆ వ్యక్తి ఓ క్షణకాలం నవ్వాడు.

'మీ రుత్త అమాయికుల్లాగా ఉన్నారు.' అన్నాడతను నాలుగు వైపులా చూస్తూ. 'యంత్రం తలెత్తడంతోనే, వంద మంది చేసే పని, పదిమందికే సరిపోయింది. మిగతా తొంభై మందీ నిరుద్యోగులైనారు. ఇలా రోజు రోజుకూ పెరిగిపోతున్న నిరుద్యోగుల సమస్య ఏదో విధంగా పరిష్కరించకపోతే, వారూరుకోరు. తిరగబడతారు. ప్రభుత్వాన్ని పడగొట్టి, తమకు కావలసిన విధంగా, దాన్ని మార్చుకొంటారు. ఈ రాక్షసులకు, ఆ పని బొత్తిగా కిట్టదు. ఆ 'మహా ప్రమాదం' రాకుండా ఉండడానికి, వీళ్ళల్లోనే కొందరిని సైనికులుగా తీసుకొని, వాళ్ళకు మారణాయుధాలిచ్చి, ఈ తిరగబడే వారిని; లేదా, ఆ అనుమానమున్న వాళ్ళను, ఎప్పటికప్పుడు శాంతి భద్రతల పేరుమీదుగా అణచివేస్తుంటారు...

'మీ అసలు ప్రశ్న కొస్తున్నాను. ఇతర దేశాలమీద పోరాడటానికి; తిరుగుబాటు దార్లను అణచడానికి మాత్రమే ఉన్న సైన్యం చాలదు. అపారమైన సైనిక బలం కావాలి. కోట్లాది ఖరీదుచేసే మారణాయుధాలు కావాలి. ఈ ఆయుధాలన్నీ, మళ్ళీ వీరి ఫ్యాక్టరీలే తయారు చేస్తాయి. అందుమీద వచ్చే లాభాలన్నీ, వీళ్ళే పొందుతారు. అయితే యుద్ధ ఖర్చులు మాత్రం, ప్రభుత్వం పేరుమీదుగా ప్రజలు భరించాలి. దిక్కూ మొక్కూ లేని ఈ అనాధులే జీతం డబ్బుల కోసం,

తుపాకి చేతబట్టుకొని, యుద్ధరంగంలోకి దూకి, ఆహుతి కావాలి. ఇది ఇక్కడే కాదు; అన్ని చోట్లా ఇంతే జరుగుతోంది. దేశ దేశాల్లోని ప్రజలు, కడుపులు మాడ్చుకొని, యుద్ధ ఖర్చులు భరిస్తున్నారు; ఆ డబ్బుతో, తమకు తామే, యుద్ధాగ్నికి బూడిదయి పోతున్నారు. అందునా, ఇందునా, వీరికొచ్చే దేమీ లేదు. రెండు చేతులా, ఏ నలుగురైదుగురు కోటీశ్వరులో, లాభాలను పోగుచేసు కొంటున్నారు.'

సింహరాజు దిమ్మరపోయాడు. అతని నోటివెంట మాట రాలేదు.

'నా మాటల్లో మీకు నమ్మకం కలగడం లేదు గమా.?' అన్నాడతను.

'కాదనుకోండి. కానీ...' అని ఓ క్షణమాగాడు సింహరాజు. 'విషయం ఇంత స్పష్టంగా తెలుస్తోందిగదా, వీరూతా సైన్యంలో చేరకుండా మానేస్తే తీరిపోదూ ?'

'అబ్బే, అది లాభం లేదు' అన్నాడతను చప్పరించి. 'తిండీ బట్టా లేక ప్రజలు అల్లాడి పోతున్నారు. పట్టెడు మెతుకుల కోసం, నానా యాతనలూ పడుతున్నారు. సైన్యంలో చేరిన వారికి, ఇవి రెండూ దొరుకుతాయి. మనిషన్నవాడు, ఏదో విధంగా బ్రతకాలి గదా ? బ్రతకడానికి, సైన్యంలో చేరడం ఒక సూత్రం. అదీగాక - పట్టుబట్టి, చేరకుండా ఉండడానికి గూడా వీల్లేదు. ఇన్ని సంవత్సరాల వయస్సున్న ప్రతివాడూ విధిగా సైన్యంలో చేరాలని ప్రభుత్వం శాసిస్తుంది.

'ఎందుకని ?' అంటూ ప్రభుత్వాన్ని ఎవ్వరూ అడగరు. అధవా అడిగితే, 'దేశ రక్షణ కోసం' అంటుంది. అసలు దేశానికి ప్రమాదం తెచ్చి పెట్టేదీ వీళ్ళే, దాన్ని రక్షించడానికంటూ మారణహోమం జరిపేదీ వీళ్ళే! చిత్రమేమిటంటే, ఈ బీభత్స కాండంతా, దేశం పేరు మీదుగా, ప్రజలు పేరు మీదుగా జరగడం. దీన్ని కాదన్న వాళ్ళను 'దేశద్రోహులు' గానూ 'అరాచక వాదులు' గానూ చిత్రించి; ప్రభుత్వం నేలబెట్టి కాలరాస్తుంది. ప్రచార సాధనాలన్నీ దాని అధికారంలో ఉంటాయి. శాసనాలు, చట్టాలు, న్యాయస్థానాలు, దాని పరంగా ఉంటాయి. ఇక నువ్వు చేసే దేమిటి ?'

సూటిగా సింహరాజు కళ్ళల్లోకి చూస్తూ అన్నాడతను. సింహరాజుకు నిలువెల్లా దహించుకు పోయింది. మాటరాక తడబడాడు.

'ఈ దేశమేదో, ఆ దేశం వారికి తెలియదు. వారికీ, వీరికీ, ఎందుకు యుద్ధం వచ్చిందో ఈ సైన్యానికి తెలియదు. ఈ దేశంలోని, తనలాటి వాణ్నే తుపాకితో కాల్చి చంపేస్తున్నాడు. దేశ దేశాల్లోని అనాధులూ క్షుధార్తులూ, ఒకరిపై మరొకరు, కుక్కల్లా కవ్వించుకొని, చీల్చుకొని, బూడిదయి పోతున్నారు. ఈ మహా నాశనం నుండి, మారణహోమం నుండి ఇక్కడా అక్కడా ఉన్న కోటీశ్వరులు బంగారాన్ని పోగుచేసు కొంటున్నారు'

అతను చెప్పడం ఆపాడు. ఆవేశంతో అతని పెదవులు

అదరుతున్నాయి. పిడికిళ్ళు బిగుసు కొంటున్నాయి. కళ్ళు, నిప్పుకణికల్లా ధగధగ లాడుతున్నాయి.

ఇద్దరి మధ్యా నిశ్శబ్దం గూడు కట్టింది. ఒకరి కళ్ళల్లోకి మరొకరు చూసుకొన్నారు. ఇద్దరూ తలలు దించేసు కున్నారు.

## 6

యుద్ధ ప్రమాదం మరింత ముందు కొచ్చింది. 'శత్రువులు' సరిహద్దును దాటి చాలా భాగం ముందు కొచ్చేశారు. ప్రజలు తండోప తండాలుగా, పారిపోతున్నారు. శత్రు విమానాలు, బొబ్బలు పెడుతూ బాంబులను విసురు తున్నాయి. గ్రామాలకు గ్రామాలు, నగరాలకు నగరాలు, అగ్నిహోత్రు నికి ఆహుతి అవుతున్నాయి. ఆబాలగోపాలం, ఆ మంటల్లో కాలి, మసి మసై పోతున్నారు. మర ఫిరంగులు గర్జిస్తూ అగ్ని గోళాలను విరజిమ్ముతుంటే, టాంకులు వీధి వీధీ, గడప గడపా నేలమట్టం జేస్తున్నాయి. ఆ కాళ మంతటా ఎర్ర కావురు కమ్మింది. వాతావరణమంతా, మనుషులు కాలిన వాసనతో సుడులు తిరుగుతోంది.

ఈ ప్రళయ కేళిని ఇక చూడలేక పోయాడు సింహరాజు. అప్పటికే అతనికి పుక్కిలింత లయింది.

ఏదో తెలుసు కొందామన్న ఉబలాటం కొద్దీ నరలోకం ప్రవేశించాడు. అత్యద్భుతంగా అభివృద్ధి చెందిన మానవుణ్ని చూచి, తనెంతో నేర్చు కొందామనీ, నేర్చుకొని ఈ పద్ధతు

లనే తనూ అమలు జరుపుదామనీ ఉత్సాహ పడ్డాడు. కానీ తన ఉత్సాహం సమసి పోయింది. తన కలలన్నీ పేలి పోయాయి. మానవ జాతినుండి తను నేర్చుకో వలసిం దేమీ లేదు; కాక పోగా, తన నుండే వారింకా తెలుసుకో వలసింది చాలా ఉన్నది. ముందు తన స్థాయిదాకా ఈ మనుషులొస్తే- తరువాత సంగతి, ఆలోచించ వచ్చు. స్వర్గాన్ని చూడాలని తను బయలుదేరాడు; మహో నగరాన్ని దర్శించి, తిరిగి వెడు తున్నాడు.

* * *

సింహరాజును చూసి, జంతువు లన్నీ హర్ష ధ్వానాలు చేశాయి. బ్రహ్మాండగా స్వాగత మిచ్చాయి. ఇంత కాలం నరలోకంలో సంచరించి, తమ ప్రభువు పొందిన అనుభవా లేవో వినాలని అవి ఎంతో ఉత్సాహాన్ని ప్రదర్శించాయి...

సాయంత్రం సభ పర్పాటు చేయబడ్డది. ఆ సభకు, అరణ్య రాజ్యంలోని 'జంతు జాల మంతా విచ్చేసింది. సింహ రాజు తన అనుభవాలన్నీ విశదీకరించాడు.

'ఈ నాటి మానవులు మానవులు కారు. మనం - కథల్లో చెప్పుకొనే రాక్షసులు. వారికి నీతీ నియమం లేదు. కట్టుబాట్లు లేవు. దయలేదు. దాక్షిణ్యం లేదు. ధర్మాధర్మాలు లేవు. న్యాయాన్యాయాలు లేవు. ఉన్నదల్లా ధనదాహం, భోగ లాలసత్వం, పరస్పర వంచన, కుట్రలు, హత్యలు, యుద్ధాలు, కరువులు, రోగాలు, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం,

అధికార తాపత్రయం—

'మనం చెయ్యి సాహసించని ఎన్నో దుష్ట కార్యాలు, మానవులు నిస్సంకోచంగా చేస్తారు. పరస్పరాంగీకారం లేనిదే మనం - కాముకేళికి ఆయత్తం కాము. కానీ మానవులు మనకు పక్కు వ్యతిరేకులు. ఎదటి వారి ఇష్టాయిష్టాలతో వారికి నిమిత్తం లేదు; కావలసిందల్లా వారి దత్తి తీరడం. ఆకలి లేనప్పుడు మనం, తిండికోసం పారుకాడం; మానవుడు - పది సంవత్సరాలకు తిండి వున్నా, పదకొండో సంవత్సరం కోసం, ఎదటివాణ్ని ఏదైనా చేస్తాడు. మనకు ప్రమాదమంటూ రాకపోతే, క్రూరంగా వుండం; కాని మానవుడు ఎప్పుడూ క్రూరంగానే ఉంటాడు. వాడి ఆలోచనలూ, కార్య విధానమూ గూడా క్రూరంగానే వుంటాయి. ప్రక్కనున్న ప్రాణికి తిండి లేకపోతే, మన తిండిలో మనం భాగ మిస్తాం; మానవుడు ఏదో విధంగా, ఎదటివాడి తిండి కాజెయ్యాలనే ఎప్పుడూ చూస్తూంటాడు. అతనినుండి నేర్చుకోవలసిందల్లా నాకొక్కటే కనిపిస్తోంది. తనను తను ఎలా నాశనం చేసుకోవాలో మానవుడికి చక్కగా తెలుసు. మన కింకా ఆ 'విద్య' తెలియదు.'

సింహరాజు ఉపన్యాసం ముగించాడు. జంతువులన్నీ కొయ్యబారి పొయ్యాయి.

* * *

'నీ ఉపన్యాసం విన్నాను' అన్నాడు నారదుడు కోపంగా చూస్తూ.

సింహారా జేమీ మాట్లాడ లేదు.

'కానీ గురిగింజ లాగా మాట్లాడ బోకు ... నువ్వేదో మానవుణ్ని నెప పెట్టుతున్నావు గానీ, అలాంటి లోపాలు నీలో మాత్రం లేవూ?' అన్నాడు నారదుడు.

'ఉండవచ్చు. అయితే ఏమయినట్టు? నాలో ఉన్న లోపాలే, మానవునిలో గూడా ఉన్నప్పుడు, అతను నాకంటే ఎందులో అధికుడో ఎట్లా అధికుడో మీరు చెప్పవలసి వుంటుంది. కాక, ఇద్దరమూ సమానమే నంటే, అతని కిచ్చిన ఆధిక్యతను మీరు ఉపసంహరించుకో వలసి వుంటుంది. అదీ గాక—మానవునితో నాకు పోలి కేమిటి? అతనిలో వున్న లక్షలాది దుష్ట బుద్ధులు నాలో లేవు. మరొకసారి ఆ పోలికను తెచ్చి, నాకు అవమానాన్ని కలుగ చెయ్యకండి' అన్నాడు సింహరాజు.

నారదుడు భగ్గుమని మండిపడ్డాడు. నోటి కొచ్చినదల్లా వాగాడు. మానవుల్ని ఆకాశాని కెత్తాడు. జంతువుల్ని పడ తిట్టాడు.

'అయ్యా! మానవుల మీది అభిమానం కొద్దీ మీ రేదో అంటున్నారు గానీ, నిజానిజాలు మీకు తెలీకపోవు...సింహం మరో సింహాన్నీ, కుక్క ఇంకో కుక్కనూ, ఏనుగు వేరొక ఏనుగునూ, పిల్లి మరొక పిల్లినీ, దున్న ఇంకో దున్ననూ తినదు. కానీ మానవుడు తనతోటి మానవుణ్ని హాయిగా తినేస్తాడు. బ్రహ్మాండమైన ఇలాంటి భేదం, ఈ రెండు జా

మధ్యా ఉండగా; మాకూ ఆ మనుషులకూ, మీ రెట్లా పోలికలు తెస్తున్నట్టు? ఎందుకు తెస్తున్నట్టు?' అన్నాడు సింహరాజు.

జవాబు చెప్పడానికి నారదు డక్కడ లేడు.